



చిన్నారుల నృత్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వేదికపై ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సొసైటీలతోనే గ్రామాల అభివృద్ధి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

రాజుపాలెం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సొసైటీలు ఎంత వృద్ధి చెందితే గ్రామాలు అంతబాగా అభివృద్ధి చెందుతాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని అనుపాలెం సొసైటీ చైర్మన్‌గా అంచులవారిపాలేనికి చెందిన తోట నరసయ్య ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సొసైటీ అనేది మనందరిదని 12 గ్రామాల్లోని ప్రజలు భావించాలన్నారు. సొసైటీలో ఎక్కువ మంది సభ్యులు ఉండేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనుపాలెం సొసైటీ ద్వారా రైతులకు సంబంధించిన అన్ని రకాల వ్యాపారాలు చేయవచ్చన్నారు. వైసీపీ హయాంలో సొసైటీలను వారి స్వార్థానికి, స్వలాభానికి ఎక్కువగా వాడుకున్నారని ఆరోపించారు. రికవరీ శాతం పెంచినప్పుడే ఉపయోగం ఉంటుందన్నారు. సొసైటీలో రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లిస్తే మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, జనసేన పార్టీ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వేంకటేశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పూజల వెంకటకోటయ్య, మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు, నాయకులు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్, నల్లమోతుల శ్రీనివాసరావు, మొరసా శ్రీను, సానికొమ్ము కోటిరెడ్డి, అంకాళ్ల ప్రభుదాసు, శనగపూల నరసింహారావు, చిన్నబోయిన రాఘవరావు, సర్పంచ్‌లు కణదం శ్రీను, తోట శ్రీను, మాజీ సర్పంచ్‌లు పులిబండ్ల సాంబశివరావు, జెట్టి కోటేశ్వరరావు, దుడ్డు అప్పారావు తదితరులు ఉన్నారు.



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

పంచాయతీల్లో.. పైసల్లేవ్



ఖాళీ ఖజానాతో పాలకవర్గాల్లో **అయోమయం**

బ్లీచింగ్ కొనడానికీ ఆందుబాటులో లేని నిధులు

అడపాదడపా వర్షాలు.. అడుగంటిన పారిశుధ్యం.. దోమలు.. తాగునీరు కలుషితం.. ప్రబలుతున్న వ్యాధులు.. జ్వరాలతో పల్లెల్లో పరిస్థితి అగమ్య గోచరంగా ఉంది. ఇప్పటికే బాపట్ల జిల్లాలో పలు గ్రామాల్లో డెంగీ జ్వరాలతో మరణాలు సంభవించగా, పలువురు చికిత్స పొందుతున్నారు. ఇదే పరిస్థితి పల్నాడు, గుంటూరు జిల్లాల్లోనూ అక్కడక్కడ ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో కనీసం బ్లీచింగ్ కొనుగోలు చేసి రోడ్లపై చల్లి కొంతైనా పారిశుధ్యం మెరుగుపరచాలనుకున్నా పంచాయతీల్లో నిధులు లేవని సర్పంచ్‌లు వాపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వకపోగా కేంద్రం ఎనిమిది నెలల క్రితం విడుదల చేసిన ఆర్థిక సంఘం నిధులను కూడా మళ్లించుకుని మొండిచేయి చూపుతోందని పంచాయతీ పాలకవర్గాలు వాపోతున్నాయి. నిధులను విడుదల చేయాలని ఆందోళనలు చేసినా ప్రభుత్వం స్పందించడంలేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పల్లెల్లో పారిశుధ్యం అధ్వానం.. ప్రబలుతున్న వ్యాధులు
- కేంద్ర నిధుల మళ్లింపుతో వట్టిపోయిన పంచాయతీ ఖజానాలు
- 8 నెలలుగా ఆర్థిక సంఘం నిధుల కోసం సర్పంచ్‌ల ఎదురుచూపు
- ఇప్పటికే డెంగీ జ్వరాలతో వణికిపోతున్న బాపట్ల జిల్లావాసులు

రూ.70.52 కోట్లు మళ్లింపు

కేంద్ర ప్రభుత్వం ఎనిమిది నెలల క్రితం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు రూ.70.52 కోట్లు విడు దల చేసింది. అయితే ఈ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించింది. పల్నాడు జిల్లాకు రూ.30.78 కోట్లు, బాపట్ల జిల్లాకు రూ.23.35 కోట్లు గుంటూరు జిల్లాకు రూ.16.39 కోట్లను పంచాయతీల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేయాల్సి ఉంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) పల్లెల్లో పారిశుధ్యం క్షీణించి దోమల వ్యాప్తి అధికమైంది. గ్రామీణులు జ్వరాల బారిన పడుతున్నారు. వర్షాలతో అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. పారిశుధ్యం మెరుగుదలను ఉద్యమంలా చేపట్టి ప్రజలకు అంటువ్యాధులు రాకుండా కాపాడాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉంది. అయితే నిధులు లేక పనులు చేపట్టలేక పంచాయతీ పాలకవర్గాలు మిన్నకుంటున్నాయి. కూటమి (మిగతా 6వ పేజీలో)



ఈపూరు మండలం ఎర్రబాలెంలో రోడ్డుపై నిలిచిన నీరు

గిరిజనుల సంక్షేమానికి చర్యలు

ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో కలెక్టర్ అరుణ్‌బాబు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకంలో 9 శాఖల సహకారంతో గిరిజనుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ప్రపంచ గిరిజన ఆదివాసీ దినోత్సవం శనివారం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా అన్ని చెంచు గూడేలలో అర్హులైన వారికి గృహ నిర్మాణాలతో పాటు కాలనీలకు రోడ్లు వేయడం, తాగునీటి సరఫరా వంటి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలోని 5 మండలాల్లోని 17 గిరిజనకాలనీల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. గిరిజన భవన్ నిర్మించాలని గిరిజన నాయకులు కోరగా కలెక్టర్ స్పందించి ప్రతిపాదనలు పంపించాల్సిందిగా గిరిజన సంక్షేమ శాఖాధికారి జోత్స్నని ఆదేశించారు. ఆధార్ కార్డు, ఇళ్ల స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పదో తరగతిలో 550 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన బి.సాయితేజ్‌నాయక్, కె.సంపత్‌నాయక్‌లకు కలెక్టర్ 5 వేల నగదు పారితోషికం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు కోటానాయక్, పాండునాయక్, విష్ణునాయక్, మేడా పోతురాజు, రావుల కొండలు, కె.దాసు తదితరులు పాల్గొన్నారు.

నాగార్జున కొండలో పర్యాటకుల సందడి



విజయపురి సౌత్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండలో శనివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు శాంతిసిరి, నాగసిరి లాంచీలలో కొండకు చేరుకొని మ్యూజియంలోని బుద్ధుని ప్రతిమలు, రాతి పనిముట్లను వీక్షించారు. అనుపు, యాంఫీ స్టేడియం, శ్రీరంగనాథస్వామి దేవాలయం సందర్శించారు. ఎత్తిపోతల జలపాతం అందాలను తిలకించారు. లాంచీల ద్వారా పర్యాటక శాఖకు రూ. 45 వేల ఆదాయం సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

మొక్కు తీర్చేందుకు వెళ్తూ.. అనంత లోకాలకు



లారీని ఢీకొట్టి తిరగబడిన తుఫాన్ వాహనం

- కొత్తగణేషునిపాడుకు చెందిన ఐదుగురి మృతి
- ఉలవపాడు వద్ద లారీని ఢీకొట్టిన తుఫాన్ వాహనం



మృతిచెందిన శ్రీనివాసరావు, సుభాషిణి (పాత చిత్రాలు)

మాచవరం, పిడుగురాళ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మనవడి పుట్టి వెంట్రుకలు తిరుమలలో వెంకన్నకు సమర్పించాలని మొక్కుకున్నారు. దీంతో ఆ మొక్కు చెల్లించేందుకు తిరుమలకు బయల్దేరిన వారిలో ఐదుగురి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్త గణేషుని పాడు నుంచి 11 మంది తుఫాన్ వాహనాన్ని అద్దెకు తీసుకుని శుక్రవారం రాత్రి తిరుమలకు బయల్దేరారు. మార్గమధ్యలో జరి గిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలతో పాటు మూడేళ్ల చిన్నారి కూడా ఉంది. ఈ సంఘటనతో కొత్తగణేషునిపాడు గ్రామంలో ఒక్కసారిగా విషాదచాయలు అలు ముకున్నాయి. ఎవరిని పలుకరించినా కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. కొత్తగణేషునిపాడు గ్రామానికి చెందిన నంబుల రామ్మూర్తి మూడేళ్ల మనవడు అభినయకృష్ణ పుట్టి వెంట్రుకల మొక్కు తీర్చుకునేందుకు డ్రైవర్‌తో పాటు 11 మంది కుటుంబసభ్యులతో శుక్రవారం రాత్రి 9 గంటల సమయంలో తుఫాన్ వాహనంలో ఇంటి నుంచి బయల్దేరారు. అర్ధరాత్రి 1:30 గంటలకు నెల్లూరు జిల్లా ఉలవపాడు సమీపానికి వెళ్లగా అక్కడ లారీని వీరి వాహనం వేగంగా ఢీకొట్టింది. దీంతో తుఫాన్ వాహనం పల్టీలు కొట్టి బోర్లా పడింది. ఈ సంఘటనలో రామ్మూర్తి భార్య వెంకట నరసమ్మ(55), చిన్నకోడలు సుభాషిణి (33), మనువడు అభినయ్‌కృష్ణ(3) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన రామ్మూర్తి పెద్దకోడలు రుక్మిణి(40), వియ్యంకుడు పిడుగురాళ్ల మండలం పెదఅగ్రహారం గ్రామానికి చెందిన యర్రం శ్రీనివాసరావు (60)లను చికిత్స నిమిత్తం కావలికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఉలవపాడు ఎస్ఐ అంకమ్మ, హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కావలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాద సమాచారాన్ని స్థానికులు ఫోన్‌లో కొత్తగణేషునిపాడులోనే బంధువులకు సమాచారం ఇచ్చారు. దీంతో గ్రామస్థులు, బంధువులు సంఘటనా స్థలానికి తరలివెళ్ళారు.

డ్రైవర్ నిద్రే కారణమా..?

తుఫాన్ వాహనం సత్తెనపల్లికి చెందిన వారిది. ఈ వాహనాన్ని రామ్మూర్తి అద్దెకు మాట్లాడుకున్నారు. అయితే రాత్రి ప్రయాణం కావడంతో డ్రైవర్ నిద్రలోకి జారి ఉంటాడని ఇదే ప్రమాదానికి కారణమని కొందరు అనుమానిస్తున్నారు. వేగంగా వెళ్తుండగా రోడ్డు పక్కన నిలబడి ఉన్న లారీ కన్పించకపోవడంతో అయినా ప్రమాదం జరిగి ఉంటుందని మరికొందరి వాదన.

ప్రాణాలతో బయటపడిన చిన్నారి

మృతి చెందిన సుభాషిణి కొత్తగణేషునిపాడు గ్రామంలో సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తుంది. ఆమె భర్త వెంకటేశ్వర్లు పిడుగురాళ్ల మండలం అగ్రహారంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. వీరి తొమ్మిది నెలల పాప ప్రాణాలతో బయట పడగా భార్య, తల్లి, వదిన, మామ చనిపోవడంతో ఆయన ఆవేదనకు అంతు లేకుండా పోయింది.

మృతదేహాలను పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఫోన్‌లో పరామర్శించిన యరపతినేని

ప్రమాద సంఘటన విషయాన్ని తెలుసుకున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బంధువులతో మాట్లాడి వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతదేహాలకు పోస్టుమార్టం త్వరగా నిర్వహించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. అలాగే టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి బాధిత కుటుంబ సభ్యులను శనివారం ఉలవపాడు ఆసుపత్రికి వచ్చి పరామర్శించి ధైర్యం చెప్పారు.

బయో మాయ



- నిండా మునిగిపోతోన్న రైతులు
- నకిలీల జోరు.. రైతులు నష్టాల పాలు
- అధికారుల నిర్లక్ష్యం.. వ్యాపారుల ఇష్టారాజ్యం

ఈపూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా బయోల తయారీ.. కోట్లకు సంపాదిస్తున్న వ్యాపారులు.. దివాలా తీస్తున్న రైతులు. ఇదీ ఈపూరు మండలంలో బయో మాయ. మండలంలో అనుమతులు లేని బయోలు అధికంగా విక్రయిస్తున్నారు. దాంతో పంటలు దిగుబడి రాక రైతులు నష్టాల పాలవుతున్నారు. మండలంలో నకిలీ, కల్తీ ఎరువులు, పురుగు మందులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నాసిరకం, నకిలీ పురుగుమందుల వాడకంతో ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు దిగుబడులు రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఈపూరు మండలం లో సుమారు 50 ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ఉండగా వ్యాపారులు 80 శాతం బయో మందులు రైతులకు అంటగడుతున్నారు. బయో ఉత్పత్తులు జీ 1, జీ 2లు మా త్రమే విక్రయించాల్సి ఉంది. ఇందుకు భిన్నంగా అనుమతులు లేని బయో ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. బయో ఉత్పత్తులు ఒక కిలో పురుగు మందు ప్యాకెట్‌పై ధర రూ.200 అయితే ఎమ్మార్పీ రూ.1200 ఉంటుంది. అంటే వ్యాపారికి వెయ్యి రూపాయలు లాభం. దీంతో వ్యాపారులు బయోవిక్రయాలపై దృష్టి పెట్టా రు. అంతేకాకుండా బయో విక్రయాలు అధికంగా చేసిన వారికి విదేశాలకు తీసు కెళ్తామన్న కం పెనీల ఆఫర్లతో వ్యాపారులు రైతు లను నిలువునా ముంచుతున్నారు. బయో మందులను అన్ని పంటలకు వాడమని వ్యాపారులు రైతు లకు అంటగడుతున్నారు. గత ఏడాది గోపువారిపాలెంలో ఓ రైతు మిరప పంటకు మందు పిచికారి చేస్తే తోట ఎండిపోయింది. ప్యాకెట్‌లో శనగ పిండి ఉందని, గుళికలకు బదులు ఇసుకకు రంగు పూసి విక్రయించారని రైతులు గుర్తించారు. రైతులు నిరక్షరా స్యులు కావడంతో వ్యాపారులు ఏ మందులు ఇస్తే రైతులు అవే తీసుకుపోయి పంటలకు పిచికారి చేస్తుంటారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుంటున్న వ్యాపారులు ఇష్టారాజ్యంగా బయో వ్యాపారం చేస్తున్నారు. బయో పురుగు మందులతో పంటలు నాశనం కావడంతో పాటు భూమి కూడా దెబ్బతింటుందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు దుకాణాల్లో తూతూమంత్రంగా తనఖీలు చేస్తున్నారే కానీ వ్యాపారులపై చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గుంటూరులోని శంకర్‌విలాస్ ఆర్‌వోబీ కూల్చివేత పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈ పనులకు అంకురార్పణ జరగగా శనివారం ఉదయం నుంచి భారీ యంత్రంతో కూల్చివేత కొనసాగుతోంది.

మూడో లైన్ నిర్మాణం.. పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు
తెలుగు సాహిత్యం యువత జీవన నైపుణ్యాలకు దిక్సూచి
• సుప్రీం కోర్టు విశ్రాంత సీజే జస్టిస్ ఎన్వీ రమణ
8

అంబేడ్కర్ గురుకులంలో స్పాట్ అడ్మిషన్లు

● 102 సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

యడ్లపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో వివిధ తరగతులలో ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ శనివారం తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 5, 6, 9, 10 తరగతుల్లో మొత్తం 102 సీట్లు ఖాళీ ఉన్నట్లు వెల్లడించారు. 5వ తరగతిలో 62 సీట్లకు.. ఎస్సీ-31, బీసీ-2, ఎస్టీలకు-39, 6వ తరగతిలో ఎస్సీ-2, బీసీ-2, 9వ తరగతిలో ఎస్సీ-3, బీసీ-1, ఎస్టీ-4 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతిలో ఎస్సీ-15, బీసీ-1, ఎస్టీ-11, ఓసీ-1 ఖాళీలు ఉన్నాయన్నారు. పాఠశాలలో చేరాలనుకునే విద్యార్థులు టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు, ఆదాయ, కుల ధ్రువ పత్రాలు తీసుకుని స్వయంగా హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమానాస్పద మృతి


రాజేంద్ర ప్రసాద్ మృతదేహం

భట్టిప్రోలు (కొల్లూరు), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ వ్యాపారి అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ శివయ్య శనివారం తెలిపారు. మండల పరిధిలోని ఓలేరు శివారులోని జాతీయ రహదారి వెంబడి..ఖాళీ ఇళ్ల స్థలాల్లో ఓ మృతదేహం పడి ఉన్నట్లు స్థానికుల నుంచి సమాచారం అందిందన్నారు. సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా.. రేపల్లెకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి మద్దుల రాజేంద్ర ప్రసాద్ (58)గా గుర్తించారు. గ్యాస్ ప్రసాద్‌గా అతను సుపరిచితుడని.. మృతదేహం పక్కన గుళికలు, శీతల పానియాలు కూడా గుర్తించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం మృతికి గల కారణాలు తెలుస్తాయని ఎస్ఐ చెప్పారు.

ఎరువుల కొరత లేకుండా తక్షణ చర్యలు

● డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు


బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, మేనేజర్ శ్రీనివాస్‌తో చైర్మన్ హరిబాబు

గుంటూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎరువుల కొరత లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎమ్ఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబు నాయుడు సూచించారు. గుంటూరు కోర్టు రోడ్డులోనున్న డీసీఎంఎస్ కార్యాలయంలో శనివారం బిజినెస్ మేనేజర్ హరిగోపాల్, కార్యాలయ మేనేజర్ శ్రీనివాస్ ఇతర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎరువుల కొరత లేకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డెల్టా ప్రాంతంలో వరి, పల్నాడు ప్రాంతంలో ప్రత్తి పంటల అవసరాలను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయశాఖ సూచనల మేరకు ఎమ్మార్పీకి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. రైతులు కూడా అవసరానికి మించి ఎక్కువ మోతాదులో రసాయనిక ఎరువులు వినియోగించి భూమిని నిస్సారం చేయవద్దని చైర్మన్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా యూరియా, డీఏపీ రైతుల అవసరాలకు అనుగుణంగా కేటాయింపుల కోసం ఇప్పటికే కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కోరినట్లు తెలిపారు. ఈ మేరకే కేంద్ర మంత్రి కూడా కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో మాట్లాడి రాష్ట్రానికి అత్యధిక మొత్తంలో కేటాయింపులు చేశారని తెలిపారు.

బిడ్డను అమ్మబోతూ..పట్టుబడింది

● గతంలో బాబును, ఇప్పుడు పాపను ● పట్టుకున్న పోలీసులు, ఆరుగురిపై కేసు నమోదు



బాపట్ల పట్టణంలోని బాలికాసదన్

బాపట్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పేగు తెంచుకొని పుట్టిన బిడ్డలను ఓ తల్లి విక్రయిస్తున్న ఘటన జిల్లాలో తీవ్ర చర్చనీయాంశమైంది. పట్టణ సీఐ ఆర్.రాంబాబు తెలిపిన వివరాలు ప్రకారం.. బాపట్ల పట్టణంలోని 11వవార్డు ఇందిరానగర్ కాలనీకి చెందిన దోనేపూడి వెంకటేశ్వరమ్మ గతేడాది తన మగ బిడ్డను రూ.లక్షన్నరకు విక్రయించి పోలీసులకు పట్టుబడింది. అప్పట్లో కేసు కూడా నమోదైంది. ఇదిలా ఉండగా రెండు నెలల పాపను మరోసారి విక్రయించి రేపల్లె పట్టణంలో బీట్ కానిస్టేబుళ్లకు పట్టుబడింది. వెకంటేశ్వరమ్మ బిడ్డను విక్రయిస్తుందనే విషయం.. బాపట్లలో దళారీగా వ్యవహరిస్తున్న జాను అనే మహిళ నగరం మండలం ప్రజ్ఞంకు చెందిన కొండలుకు సమాచారం ఇచ్చింది. అతను అవనిగడ్డలో ఉంటున్న లక్ష్మీ అనే మహిళకు చెప్పాడు. ఆమె అవనిగడ్డ దగ్గర పోలూరుకు చెందిన భగవద్గీత అనే మహిళకు చెప్పింది. దీంతో భగవద్గీతకు.. బిడ్డలు లేకపోవడంతో కొనటానికి సిద్ధపడింది. రూ.2 లక్షలు ఇచ్చి.. బిడ్డను తీసుకుంది. బిడ్డకు మరొక బేరం రావడంతో దళారీగా ఉన్న జాను బిడ్డ తల్లితోపాటు నూరు అనే మరొక మహిళను పంపించి బిడ్డను తీసుకురమ్మని చెప్పింది. శుక్రవారం రాత్రి వీరిద్దరు రేపల్లె వెళ్లి బిడ్డను ఇవ్వమని గొడవపడుతుండగా బీట్ పోలీసులు గమనించి విచారించగా అసలు విషయం బయట పడింది. దీంతో వారు బాపట్ల జిల్లా బాలల సంరక్షణాధికారి పురుషోత్తంకు సమాచారం ఇచ్చారు. ఆయన సీఫార్ కోఆర్డినేటర్ బి.కిషోర్‌తో వెళ్ళి బిడ్డతోపాటు తల్లి వెంకటేశ్వరమ్మ, నూర్‌లను తీసుకొచ్చారు. బిడ్డను బాలికాసదన్‌లో సంరక్షణలో ఉంచారు. వెంకటేశ్వరమ్మ, నూర్‌లను సఖీవన్‌స్టాప్ సెంటర్‌లో పెట్టారు. శనివారం సాయంత్రం డిస్ట్రిక్ చైల్డ్‌ప్రొటెక్షన్ యూనిట్‌లో పనిచేస్తున్న స్పెషలైజ్ ఎడాప్టెడ్ ఏజెన్సీ వర్కర్ శైలజ, సీఫార్ సంస్థ కోఆర్డినేటర్ బడుగు కిషోర్ కలిసి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గతేడాది బిడ్డను విక్రయించిన కేసులో నిందితురాలిగా ఉండి మళ్లీ.. మరోబిడ్డను విక్రయించడం గమనార్హం.

కమ్మజన సేవ సమితి సేవలు అభినందనీయం

● పారిశ్రామికవేత్త మాదల చైతన్య
● వసతి గృహానికి రూ.20 లక్షల విరాళం


పాలకవర్గ సభ్యులకు చెక్కును అందజేస్తున్న మాదల చైతన్య

గుంటూరు(తూర్పు), ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గ్రామీణ బాలికల విద్యను ప్రోత్సహిస్తున్న కమ్మ సేవ సమితి సేవలు అభినందనీయమని ప్రముఖ పారిశ్రామిక వేత్త మాదల చైతన్య అన్నారు. స్థానిక కుందుల రోడ్డు, బాలికల వసతి గృహ అవరణలో సమితి గౌరవ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావుకు రూ.20 లక్షల విరాళాన్ని ఆయన అందజేశారు. చైతన్య మాట్లాడుతూ ఉన్నత విద్య ను బాలికలకు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న సమితి సేవలలో భాగస్వామ్యం అవ్వడం అదృష్టమన్నారు. ప్రతిభ ఉన్నప్పటికి పేదరి కం అడ్డంకిగా మారి ఉన్నత విద్యను అభ్యసించలేక పోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని విరాళం అందజేస్తున్నట్టు చెప్పారు. సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మాదల చైతన్య విద్యార్థులకు సేవ చేసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి దాతలు మరింతగా సహకరించాలని కోరారు. మాదల రత్నగిరి బాబు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	111, 119, 130
చికెన్ విత్ స్కిన్(కిలో)	210.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	220.00

డ్రంకెన్‌డ్రైవ్.. మాజీ సర్పంచ్ పై లాఠీతో దాడి

● బంధువుల రాస్తారోకో ● రెండు గంటలు ట్రాఫిక్ సమస్య


రోడ్డు పై రాస్తారోకో చేస్తున్న బాధితుడి బంధువులు, గాయపడిన శ్రీనివాసరావు

బెల్లంకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌చార్జి ఎస్ఐ ఆలురెడ్డి, సిబ్బంది మండ లంలోని నాగిరెడిపాలెం గ్రామ సమీపంలో గంగమ్మ గుడి వద్ద డ్రంక్ డ్రైవ్ శనివారం సాయంత్రం నిర్వహించారు. నాగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కె.శ్రీనివాసరావు స్వగ్రా మం నాగిరెడ్డిపాలేనికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. పోలీ సులు లాఠీని అడ్డం పెట్టి ఆపేందుకు యత్నించారు. వాహనం ఆపకుండా వెళ్తున్నాడనే అనుమానంతో..ఓ కానిస్టేబుల్ అతని మొఖంపై లాఠీతో తీవ్రంగా గాయపరిచారు. రక్తస్రావంతో శ్రీనివాసరావు గ్రామానికి బంధువులకు సమాచారం ఇవ్వడంతో.. అందరూ కలసి మెయిన్ రోడ్డుపై రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. బెల్లంకొండ ఎస్ఐ, పోలీసు సిబ్బంది అక్కడికి వచ్చి నచ్చజెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. క్రోసూరు, సత్తెనపల్లి సీఐలు సురేష్, కిరణ్ సర్ది చెప్పినా వారు వినలేదు. తనపై దాడి చేసిన కానిస్టేబుల్ ఎవరో తెలియాలంటూ.. సీఐని ప్రశ్నించారు. దాడి చేసిన సిబ్బందిని వెంటనే తెలుసుకుంటామని, పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుకుందామని చెప్పటంతో బాధితులు పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. నాగిరెడ్డిపాలెంలో ఉన్న మద్యం షాపును బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్దకు మార్చారు. దీంతో పోలీసులు మద్యం షాపు సమీపంలోని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు రాస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పొలం పనులు చేసుకొనే రైతులు, కూలీలు కొందరు పని అనంతరం సాయంత్రం మద్యం తీసుకుంటారు. పోలీసులు వారినే టార్గెట్‌గా డ్రంక్ డ్రైవ్ పేరుతో కేసులు నమోదు చేసి, ఇబ్బందులు పెడుతున్నారని స్థానికులు అంటున్నారు.

వాహనం తిరగబడి..చిన్నారి మృతి

వినుకొండటౌన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆటో తిరగబడి ఓ పసి బాలుడు మృతిచెందగా మరో నలుగురికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని వెంకుపాలెం కురవ సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బొల్లాపల్లి మండలం సీతారామపురం తండాకు చెందిన మేరాజోత్ ప్రసన్ననాయక్ బొల్లాపల్లి మండలం కురవ సమీపంలోని ఆంజనేయస్వామికి మొక్కులు చెల్లించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మిగిలిన ఆహార పదార్థాలను వినుకొండలోని ఏనుగుపాలెం రోడ్డులోని కాశినాయన ఆశ్రమం వద్దకు చేర్చారు. ప్రయాణంలో బొలేరో వాహనంలో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం పల్టీ కొట్టడంతో మేరాజోత్ ప్రసన్ననాయక్ కుమారుడు అంజయ్యనాయక్ (2) మృతిచెందాడు. ప్రసన్ననాయక్‌తో పాటు మూడావత్ గోలియానాయక్, బాణావత్ హనుమానాయక్, మూడావత్ కరుణనాయక్‌కు గాయాలు కావడంతో.. బంధువుల సాయంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకుల పాఠశాలలో..

ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు సిటీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని సంగడి గుంట (పొన్నూరు రోడ్డు)లో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల(మైనారిటీ)లో 5వ తరగతి చదివేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బాలశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మిగిలిన సీట్లు కోసం దరఖాస్తు చేసుకోవాలని వెల్లడించారు. ఎస్సీ 9, ఎస్టీకు 10 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 14 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 16 న పరీక్ష నిర్వహించి సీట్లు కేటాయిస్తామని తెలిపారు. వివరాలకు 87126 25039, 63020 18886, 86888 63345 నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

గుంటూరు కార్పొరేషన్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ తెలిపారు. సుమారు 35-40 సంవత్సరాలు వయస్సు ఉంటుందని పేర్కొన్నారు. మృతి కారణాలు తెలియరాలేదని, బ్లూ రంగు గడుల షర్ట్, నలుపు రంగు కాటన్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు చెప్పారు. ఆర్టీసీ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. వివరాలు తెలిసిన వారు సీఐ 86888 31325, ఎస్ఐ 8688 831329 సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

పంచాయతీల్లో పైసల్లేవ్

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆర్థిక సంఘం మొదటి విడత నిధులను గత నవంబరులో పంచాయతీలకు జమ చేసింది. ఇక ఇదే రీతిన నిధులు వస్తాయని పాలకవర్గాల సంతోషం ఎంతోకాలం నిలవలేదు. రెండో విడత నిధులు విడుదలలో తీవ్రజాప్యం జరుగుతుండటంతో పాలకవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాకు మళ్లించుకుంది. నిధుల కోసం గతంలో మాదిరిగానే ఆందోళన బాట పట్టారు. పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి కార్యాలయం వద్ద గత మంగళవారం ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. నిధులు జమ చేయకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని సర్పంచ్‌లు స్పష్టం చేసినా ప్రభుత్వంలో స్పందనలేదు.

11 సీట్లకు పరిమితమైనా.. మార్పు రాలేదు

● ఎమ్మెల్యే ఆనందబాబు


ఒంటిమిట్టలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ గత సార్వత్రిక ఎన్నికలో 11 సీట్లకు పరిమితమైన నాయకత్వంలో ఏమాత్రం మార్పు రాలేదని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు విమర్శించారు. శనివారం కడప జిల్లాలోని ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచార కార్యక్రమంలో పార్టీ అభ్యర్థి ముద్దు కృష్ణారెడ్డి తరుపున ఆయన సాలాబాద్, మలకట్‌పల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుసుకుని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వం, చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని చెప్పారు. సాధారణ ఉప ఎన్నికల్లో సైతం వైసీపీ నాయకులు గెలుపు కోసం రౌడీలతో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని ఐదేళ్లలో సర్వనాశనం చేయడం వల్లే గత ఎన్నికల్లో వైసీపీకి రాష్ట్ర ప్రజలు గట్టి బుద్ధి చెప్పారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఉప ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచన చేసి.. టీడీపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ నెల 12న జరిగే జడ్పీటీసీ ఉప ఎన్నికలో పార్టీ అభ్యర్థికి ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు.

దేశానికే ఏపీ పోలీస్ ఆదర్శం: చీఫ్‌విప్ జీవీ


ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ పోలిసంగ్ ఆదర్శంగా నిలిచిందని ఇండియా జస్టిస్ రిపోర్ట్‌లో వెల్లడించిన వివరాలు, ర్యాంకులే ఇందుకు నిదర్శనమని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కూడా గడవ కముందే చట్టాల అమలు, శాంతిభద్రత పునరుద్ధరణలో సాధించిన పురోగతిని ఆ నివేదిక కళ్లకు కట్టిందన్నారు. సత్వర న్యాయం, పటిష్ట పోలీసింగ్, ప్రజలకు న్యాయ సహాయం వంటి సూచిలతో అగ్రస్థానాలు సాధించి ప్రజలకు భరోసా కల్పించిందని తెలిపారు. విపక్ష వైసీపీ నేత జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న విమర్శలకు కూడా ఈ నివేదిక సమాధానం అని చురకలు వేశారు. కేవలం ఏడాది వ్యవధిలోనే రాష్ట్రం చట్ట పాలనలో 6.32 స్కోర్ సాధించి దేశంలోనే 2వ స్థానంలో నిలవడం, జగన్‌లాంటి అరాచక శక్తులకు అర్థమవుతుందో లేదనన్నారు. ఇండియా జస్టిస్ నివేదికలో 6.78పాయింట్లతో కర్ణాటక మాత్రమే ఏపీ కన్నా పై ర్యాంక్ సాధించిందని, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు తదుపరి స్థానాల్లో ఉన్నాయన్నారు. జగన్ పాలనలో ఇందుకు పూర్తి విరుద్ధ పరిస్థితులు రాజ్యమేలాయని, ప్రస్తుతం ప్రతి పౌరుడు సురక్షితమైన భావంతో జీవిస్తున్నారని స్పష్టం చేశారు. ఉచిత న్యాయసహాయం అందించడంలో ఏపీ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం, పేదలు, వెనుకబడిన వర్గాల వారికి న్యాయం అందించడంలో ప్రభుత్వం కట్టుబాటును చూపిస్తుందని తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఉంచిన విశ్వాసాన్ని ఇండియా జస్టిస్ రిపోర్టే బలపరుస్తుందని తెలిపారు.

బిల్లులు చెల్లించకుంటే విద్యుత్ సరఫరా నిలిపివేత

మాచర్లటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించకుంటే ఎటువంటి నోటీసులు లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. ఈ నెల 12న ఉన్నతాధికారులు పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో సమీక్ష నిర్వహించి, రెవెన్యూ కలెక్షన్‌పై తనిఖీ చేయనున్నారని తెలిపారు. విద్యుత్ బకాయి ఉన్న వినియోగదారులు చెల్లించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంచులవారిపాలెం శివారు అంబేద్కర్ గిరిజనగూడెంలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హామీ ఇచ్చారు. శనివారం అంతర్జాతీయ ఆదివాసీ గిరిజన దినోత్సవం సందర్భంగాఎమ్మెల్యే, అంబేద్కర్ గిరిజన గూడెంను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కన్నా మాట్లాడుతూ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం, మంచి నీరు తదితర సమస్యలను పరిష్కారిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు దరువూరి నాగేశ్వరరావు, అంచుల నరసింహరావు, పూజల వేంకటకోటయ్య, అంకాళ్ల ప్రభుదాసు తహసీల్దార్ సరోజ, ఏపీఎం శివకుమార్ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్ సహకారంతో మండలంలోని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వివిధ పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు శనివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రలో వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన గర్భిణులకు శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. 75త్యాళ్లూరుకు చెందిన బెజ్జం నాగేశ్వరరావు సహకారంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో. స్టేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరక్టర్ కె.వెంకటసుబ్బారావు ఆహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, జనచైతన్య సమితి కార్యదర్శి టి సాంబశివరావు, ఆరోగ్యకేంద్రం డైరక్టర్ బి.సౌజన్య, వి .నిల్‌కుమార్, బి.నాగేశ్వరరావు, డాక్టర్ ఎం.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కమిటీలో సత్తెనపల్లి వాసులకు స్థానం

సత్తెనపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సీపీఐ కమిటీలో సత్తెనపల్లికి చెందిన ముసునుగూరి రమేష్ కార్యవర్గ సభ్యుడిగా, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా కంభాల శ్రీనివాస్, వల్లెం చెన్నకేశవులకు స్థానం లభించింది. వినుకొండలో ఇటీవల జరిగిన సీపీఐ పల్నాడు జిల్లా రెండవ మహా సభల్లో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బైక్ దగ్ధం

సత్తెనపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): బైక్ దగ్ధమైన సంఘటన మండంలోని రెంటపాళ్ళ, కొంపెర్లపాడు మార్గ మధ్యలో శనివారం చోటు చేసుకుంది. కృష్ణమూర్తి అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పెద్ద శబ్దం వచ్చి మంటలు వచ్చాయి. దీంతో తాను బైక్ దిగానని, మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదని, బైక్ పూర్తిగా కాలిపోయిందని కృష్ణమూర్తి తెలిపారు.

రాఖీ పౌర్ణమి వేడుకలు

అచ్చంపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలంలో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సోదరులకు రాఖీలు కట్టి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో పూజలు జరిగాయి.

● పెదకూరపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాఖీ పౌర్ణమి సందర్భంగా మండలంలో అన్నాచెల్లెళ్ళు, అక్కలు వారి తోబుట్టువులకు రాఖీలు కట్టి ప్రేమను పంచుకున్నారు. సోదరులకు స్వీట్లు పెట్టి ఆశీర్వాదాలను పొందారు.

చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నందుకు ధన్వంతరీ నాయీబ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబునాయుడు చిత్రపటానికి సంఘనాయకులు పాలాభిషేకం చేశారు. శనివారం జరిగిన కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరక్టర్ ఎం గంగాధర్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంపై అవగాహన

పెదకూరపాడు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయం ద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చని విశాంత ఏడీఏ బీ శ్యామ్ సుందరరెడ్డి అన్నారు. మండలంలోని 75 తాళ్ళూరులో శనివారం సుస్థిత వ్యవసాయం పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నేలగిరి ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ రత్తయ్య, బాజీ, శ్రీనివాస్, గుత్తికొం కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్న అన్నప్ప సేవలు ఆదర్శ నీయం

పెదకూరపాడు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): చిన్న అన్నప్ప సేవలు ఆదర్శనీయమని భావన రుషి దేవాలయ కమిటీ అధ్యక్షుడు అనుముల వెంకటరావు అన్నారు. లగడపాడులో శనివారం స్టేట్ హ్యాండ్‌లూమ్స్ టెక్స్‌టైల్స్ అసిస్టెంట్ విశ్రాంత డైరెక్టర్ అవ్వారి చిన్న అన్నప్ప సమాజానికి అందించిన సేవలు మరువ లేనివన్నారు. ఈ సందర్భంగా చిన్న అన్నప్ప దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అవ్వారి రవీంద్రనాథ్ ఠాగూర్, సత్యం, నాగరాజు, పెద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శేషగిరిరావు ధైర్యం కార్తకర్యలకు స్ఫూర్తి

● నరసరావుపేట ఎంపీ లావు

రెంటచింతల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత నంబూరి శేషగిరిరావు ధైర్యం,పార్టీ కోసం తెగించిన వైనం కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమన్నారు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు.. పాలువాయిగేట్ గ్రామానికి చెందిన టీడీపీ నేత నంబూరి శేషగిరిరావు ఆకస్మాత్తుగా మృతి చెందిన నేపథ్యంలో శనివారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత శేషగిరిరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భార్య కృష్ణవేణిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ నెల 15 తరువాత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి మృతుని కుటుంబ సభ్యులను సీఎం వద్దకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.


కృష్ణవేణిని ఓదార్చుతున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవంలో ఎంపీ

రెంటచింతలలోని ఎర్రపాలెంలో శనివారం అభయాంజనేయస్వామి, బుడియబావు ఆలయాల విగ్రహ,ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ సీనియర్ నేత ఎనిగండ్ల రమేష్‌బాబు, పాలువాయి సర్పంచ్ విజయలక్ష్మి లచ్చిరెడ్డి గృహాల్లో జరిగిన వివాహ వేడుకల్లో ఎంపీ పాల్గొని వధూవరుల ఆశీర్వదించారు. కార్యక్రమంలో శౌరీ నాయక్, మంగ్లనాయక్, నరసింహనాయక్, ఆదూరి శివ, సోమేశ్వరరావు, హనిమిరెడ్డి, తుపాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే యరపతినేనికి రాఖీ కడుతున్న తెలుగు మహిళలు

అన్నగా తోడుంటా..

● యరపతినేనికి రాఖీ కట్టిన మహిళలు

పిడుగురాళ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తన వెన్నంటి నడుస్తున్న ప్రతి మహిళకు అన్నగా తోడుంటానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శనివారం పిడుగురాళ్లలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు పట్టణంలోని పలువురు తెలుగుమహిళా విభాగం సభ్యులు చల్లగుండ్ల సీత, చల్లా అంజమ్మ, కోకాటి శారద, కొంకా రాధ, కోమటినేని లక్ష్మీ, దియ్యా విజయ, అల్లూరి సామ్రాజ్యం, బిజిలి అంజలి, నూతి అరుంధతి, వట్టికుంట విజయలక్ష్మీ, యామిని పద్మ, తాళ్ల నిర్మల తదితరులు రాఖీ కట్టి స్వీట్స్ తినిపించారు.

ట్రాక్టర్ ర్యాలీని జయప్రదం చేయండి

మాచర్లటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని సమగ్రంగా అమలు పరిచి నిధులు కేటాయించిన సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ మాచర్ల నియోజకవర్గ రైతులతో భారీగా ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానదరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ఉదయం 10 గంటలకు రాయవరం జంక్షన్ నుంచి మాచర్ల వ్యవసాయమార్కెట్ వరకు ట్రాక్టర్ ర్యాలీ జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని రైతులు, మహిళలు అధిక సంఖ్యలో ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి కోరారు.

రైతులు ఈ-పంటను నమోదు చేసుకోవాలి

నకరికల్లు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రైతులు తాము సాగు చేస్తున్న ప్రతి పంటను ఈ-పంటలో నమోదు చేయించు కోవాలని ఏవో కే దేవదాసు రైతులకు సూచించారు. శనివారం నరసింగపాడులో వ్యవసాయ సహాయకురాలు ఎస్‌కే ముస్తాక్ ఈ పంట నమోదు విధానాన్ని ఏవో పరిశీలించారు. ఈ-పంట నమోదుతో పంటల బీమా ప్రయోజనం చేకూరుతుందన్నారు. అన్నదాత సుఖీభవకు అర్హత ఉన్న రైతులు తమ పరిధిలో గల రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏవో కోరారు. అర్హత ఉండి డబ్బులు పడని రైతులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు.

మహిళ మృతదేహానికి పోస్టుమార్టం

రాజుపాలెం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపాపాయపాలెం సమీపంలో మృతి చెందిన గుర్తు తెలియని మహిళ మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. గుంటూరు మెడికల్ కాలేజి ఫోరెన్సిక్ ప్రొఫెసర్, పల్నాడు జిల్లా క్లూస్ టీం వచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ కిరణ్, ఎస్సై వేణుగోపాల్ పర్యవేక్షించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

రెంటచింతల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మంచికల్లులో శనివారం లక్ష్మీగణపతి ఆలయనిర్మాణానికి భూమిపూజను శనివారం నిర్వహించారు. రూ.35 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు ధర్మకర్త కాశిబోయిన రామ్మూర్తి, ధనలక్ష్మి చెప్పారు. సర్పంచ్ గోగుల పుల్లారెడ్డి, సొసైటీ చైర్మన్ యరపతినేని మట్టయ్య, కె.వెంకటేశ్వర్లు,, ధర్మనబోయిన అబీట్, వీరయ్య, రామారావు, గోగుల వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులు లక్ష్యంగా వైసీపీ దాడులు

దుర్గి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దళితులు లక్ష్యంగా వైసీపీ నేతలు దాడులు చేస్తున్నారని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరులు అనిల్‌రెడ్డి, దినేష్‌రెడ్డి ఓ దళిత యువకుడిని గదిలో బంధించి క్రూరంగా దాడి చేశారన్నారు. స్పృహ కోల్పోయిన యువకుడి వీడియోలు అతని తండ్రికి పంపి పైశాచిక ఆనందం పొందారన్నారు. దళితులపై దాడులు సహించేది లేదని జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు క్షమాపణ చెప్పాలని దాసు డిమాండ్ చేశారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ

నకరికల్లు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం శనివారం నకరికల్లులో వైభవంగా జరిగింది. జీవధ్వజ గోపుర శిఖరకలశ శిలావిగ్రహాలను ప్రతిష్ఠించారు. మహాగణపతి, బ్రహ్మేశ్వరస్వామి, ఈశ్వరీ మహాదేవి, సిద్ధమూర్తి, నందీశ్వరస్వామి, నాగేంద్రస్వామి, అభయాంజనేయస్వామి దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తులకు భారీగా అన్నదానం చేశారు. పూజా కార్యక్రమాల్లో తెలంగాణా రాష్ట్రం దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కేవీ హరీష్‌బాబు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో హరీష్‌బాబుకు స్వాగతం పలికారు.


పూజల్లో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి హరీష్ బాబు, కుటుంబ సభ్యులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సత్తెనపల్లి రూరల్, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుడిపూడి -పెదమక్కెన మార్గంలో వాగు వద్ద జరిగింది. రూరల్ పోలీసుల కథనం మేరకు అమరావతి మండలం మునగోడు గ్రామానికి చెందిన నేలపాటి మనోహర్(22) అమరావతిలోని బేకరీలో పని చేస్తుంటాడు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో బేకరీ ఓనర్ బండి తీసుకొని బయటకు వచ్చాడు. అప్పటినుంచి ఎవ్వరికి కన్పించలేదు. ఉదయాన్నే పొలం వెళ్ళే రైతులు వాగులో బండి ఉండటం, ఫోన్ రింగ్ అవ్వటంతో అక్కడికి వెళ్ళిచూడగా యువకుడి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించి ఫోన్ నెంబర్ల ఆధారంగా సమాచారాన్ని మృతుని తల్లిదండ్రులకు చేరవేశారు. తల్లిదండ్రులు సువార్తమ్మ, చంద్రరావులు ఏరియా వైద్యశాలకు వచ్చి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. చంద్రరావు ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాగాణి సాగు ప్రశ్నార్థకం

● ఎండిపోయిన క్రోసూరు చెరువు ● నెర్రెలిచ్చిన నారుమళ్లు


చుక్కనీరు లేకుండా ఎండిపోయిన క్రోసూరు చెరువు

క్రోసూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు, ఎర్రబాలెం గ్రామాల్లోని పంటల సాగుకు ప్రధాన నీటివనరుగా ఉన్న క్రోసూరు చెరువు పూర్తిగా ఎండిపోయింది. దీంతో ఈ సంవత్సరం మాగాణి సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఆగస్టు మొదటి వారం గడిచినా ఇంతవరకు క్రోసూరు చెరువులో చుక్కనీరు లేకపోవటంతో రెండు గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. చెరువు కింద సుమారు ఆరు వందల ఎకరాల వరకు మాగాణి సాగవుతుంది. మరో వైపు కొద్దో.. గొప్పో నారు మళ్లు వేయగా.. అవి ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర మనో వ్యథ చెందుతున్నారు. ఏటా జూన్ 2వ వారానికి చెరువుకు నీరు వచ్చి.. జూలై మొదటి వారంలో వరి నాట్లు పడేవి. సుమారు నాలుగు వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న చెరువు ప్రధాన సాగు నీటి వనరుగా ఉంది. అందుకూరు గ్రామానికి చెందిన కొంత భాగం పొలాలకు కూడా ఈ చెరువు తూముల ద్వారా నీరు అందుతుంది. నాగార్జున సాగర్ కాల్వలకు నీరు విడుదల చేయటంతో ఆ నీటితో నైనా చెరువును నింపి మాగాణి సాగుకు సహకరించాలని రైతులు కోరుతున్నారు. ఈ మేరకు ఇటీవల కొంత మంది రైతులు అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ ఇంత వరకు ఎటువంటి స్పందన లేదు. ఇప్పటికైనా క్రోసూరు చెరువును నింపి నారు మళ్ళతో పాటు మాగాణి సాగు చేసుకొనే విధంగా సహకరించాలని రైతులు కోరుతున్నారు.

శ్రీనివాసరావుకు సన్మానం

మాచర్లటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా ఎన్నికైన గంగుల శ్రీనివాసరావును దళిత బహుజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సన్మానించారు. పట్టణంలోని శ్రీనివాసరావు కార్యాలయంలో ఆయన్ను కలిసి దుశ్శాలువలు, పూలమాలలతో సన్మానించారు. సన్మానించిన వారిలో దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కుక్కమూడి ప్రసాద్, దళిత బహుజన బీమ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు జార్జి తదితరులు ఉన్నారు.

గర్భిణులకు అన్నప్రసాదం అందజేత

కారంపూడి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో శనివారం గర్భిణులు, ఆసుపత్రి సిబ్బందికి శ్రీవాసవీ సేవా అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యాన అన్నప్రసాదం అందజేశారు. సుమారు 200మంది అన్నప్రసాదానికి సముద్రాల ప్రకాష్, రేణుక దంపతులు, కుమార్తె శృతి, కుమారుడు శ్రీకర్ సహకరించారు. ఈ కార్యక్రమంలో వెలుగూరి శేషారావు, భారతి, అన్నప్రసాద కమిటి ఫౌండర్ భవిరిశెట్టి రామరావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయి వెంటనే చెల్లించాలి

క్రోసూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా పేరుకుపోయిన ఉద్యోగుల పెండింగ్ బకాయిల ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని క్రోసూరు తాలూకా యూనిట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శిఖా శ్యామ్‌సన్ కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నిర్వహిస్తున్న రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని శనివారం ఆయన క్రోసూరులో నిర్వహించారు. పలువురు మహిళా ఉద్యోగులతో సమావేశం అయ్యారు. శ్యామ్‌సన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల బకాయి చెల్లింపునకు నూతన విధానాన్ని అవలంబించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్యోగులకు మేలు చేయగలరన్న ఆశాభావంతో తామున్నామన్నారు.

కళలను అనుసంధానం చేసి బోధించాలి..

రెంటచింతల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): గణితం సైన్స్ బోధనలో టీచర్లు కళలను అనుసంధానం చేసినట్లయితే విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, మానసిక ఉల్లాసం పెరుగుతుంని ప్రముఖ విద్యావేత్త, రచయిత రమణజీవి సూచించారు. శనివారం రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో ఎంఎల్ఆర్ ఫౌండేషన్ 4వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్ఆర్ఐ మోదుగు మధుసూదనరెడి అధ్యక్షత వహించారు. గణితం, సైన్స్ బోధనా పద్ధతుల్లో ప్రతిభ కనపర్చిన 14 మంది టీచర్లకు రూ.1.70 లక్షల నగదును అందచేశారు. చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన చిన్నారులు సర్టిఫికెట్స్ అందచేశారు. కార్యక్రమంలో ఫాదర్ గోవిందు బాలస్వామి, హెచ్ఎం దుర్గాప్రసాద్, డాక్టర్ చిన్నమ్మ, డాక్టర్ సుధ, ఎం.ఉదయ్‌రెడ్డి, ఎం.అనిల్‌రెడ్డి, ఎం.భానుమతి, ఫౌండేషన్ డైరక్టర్ కళ్యాణ్, పల్లెర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పనులు ఆపారు.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అమరావతి నుంచి క్రోసూరు వెళ్లే రోడ్డులో ధరణికోట కళాశాల వరకు రహదారి ఇరువైపులా డ్రైయినేజ్ కాల్వలు రెండు అడుగుల ఎత్తులో నిర్మించారు. ఈ పనులు నిలుపుదల చేసి మూడు నెలలు కావస్తోంది. వర్షపు నీరు కాల్వల్లోకి వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిలబడి పోతోంది. దీంతో రాకపోకలు సాగించే వారికి తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. డ్రైయినేజ్ కాల్వల నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వదిలేయడంతో ఈ సమస్య ఏర్పడింది. అంతేగాక పోలీసు స్టేషన్ వద్ద సుమారు 5 అడుగుల ఎత్తు పెంచి.. చప్టాలు ఏర్పాటు చేయడంతో అక్కడ కూడా వరద నీరు నిలబడిపోతోంది. దీంతో కొన్ని రోజుల పాటు ప్రజలు ఇబ్బందులు పడతున్నారు. ఇక్కడ సీసీ రోడ్డు వేస్తామని చెప్పి ఇంత వరకు పనులు ప్రారంభించలేదు. ఇప్పటికైన ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి వరదనీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


వెళ్లే మార్గం లేక రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మాదక ద్రవ్యాలకు బానిసలు కావొద్దు

● ఎక్సైజ్ సీఐ బుజ్జిబాబు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

గురజాలటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు కూలీలు, యువత బానిస కావొద్దని ఎక్సైజ్ సీఐ బుజ్జిబాబు అన్నారు. శనివారం పట్టణ శివారులోని మిర్చి శీతల గిడ్డంగుల వద్ద కూలీలకు మాదకద్రవ్యాలపై వల్ల దుష్పరిణాలపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.


మృతుల కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి

మృతుల కుటుంబాలకు జంగా పరామర్శ

పిడుగురాళ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ప్రాంతం నుండి తిరుపతి వెళ్తూ నెల్లూరు జిల్లా కావలి సమీపంలో ప్రమాదంలో మృతిచెందిన కుటుంబసభ్యులను టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి శనివారం పరామర్శించారు. విషయం తెలిసిన వెంటనే జంగా కృష్ణమూర్తి ఘటనా స్థలాన్ని సందర్శించి నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లి మెడికల్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని ఓ యువకుడు చెట్టుకు ఉరిపోసుకొని మృతిచెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మోహన్ సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున ప్రాజెక్ట్ నీటిమట్టం శనివారం నాటికి 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,313, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,890 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలంనుంచి ఇన్‌ఫ్లోగా 65,530 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది.

పులిచింతల...

అచ్చంపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.76 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 37,705 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, రెండు గేట్ల ద్వారా 34,409, లీకుల ద్వారా 400, మొత్తం 51,409 క్యూసెక్కుల నీరు దిగువకృష్ణకు విడుదల అవుతుంది.

పేదలకు చీరలు పంపిణీ

విజయపురిసౌత్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం పురస్కరించుకొని స్థానిక సేవాలాల్ ఆలయంలో 40 మంది పేదలకు శనివారం చీరలను పంపిణీ చేశారు. శ్రీమాన్ బ్రహ్మశ్రీ రామానుజదాస ఆర్థిక సాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు, చందునాయక్, బాణావత్ వెంకటేష్ నాయక్, రెడ్యానాయక్, వస్తుపురి శ్రీరామ్మూర్తి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన దినోత్సవం

రెంటచింతల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎస్.మోహన్ మాట్లాడుతూ గిరిజను విద్యాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త శ్రీనివాసరావు, థామస్, టీచర్లు పాల్గొన్నారు.

క్రోసూరు ఏఎంసీకి నూతన పాలకవర్గం

క్రోసూరు, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): క్రోసూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు నూతన పాలక వర్గాన్ని నియమిస్తూ అగ్రికల్చరల్ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గౌరవ చైర్మన్‌గా, షేక్ జెరీనా చైర్మన్‌గా, రాయిడి సాంబశివరావు వైస్‌చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మరో 13మందిని పాలకవర్గ సభ్యులు, నలుగురు అధికారులను ఎక్స్‌అఫీషియో సభ్యులుగా నియమించారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు


నిందతుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పార్కు ఏరియాలో ఐదు రోజుల క్రితం డి.లక్ష్మీకాంతమ్మ అనే వృద్ధురాలిపై దాడి చేసి బంగారాన్ని అపహరించిన కేసులో ఇద్దరు యువకులను శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ హనుమంతరావు తెలిపారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన చావల లక్ష్మణ్, నల్లబోతుల వెంకట దుర్గా ప్రసాదు జల్సాలకు అలవాటు పడ్డారన్నారు. లక్ష్మీకాంతమ్మ ఇంట్లో ఒంటగిరిగా ఉండటం గుర్తించి ఆమెపై దాడి చేసి మెడలో ఉన్న 40 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకు వెళ్ళారని తెలిపారు. వారితో పాటు మరొక యువకుడు కూడా ఉన్నట్లు చెప్పారు. అరెస్టు చేసిన ఇరువురి నుంచి 40 గ్రాముల బంగారు ఆభరణాలను, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇద్దరినీ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. పట్టణ సీఐ నాగ మల్లేశ్వరరావు, ఎస్ఐ పవన్ కుమార్ ఉన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలి


వేడుకల్లో పాల్గొన్న డీఎస్పీ హనుమంతరావు

సత్తెనపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యనభ్యసించి మంచి స్థానంలో ఉంటేనే తల్లిదండ్రుల కష్టానికి విలువ ఉంటుందని సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు అన్నారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోగల సాంఘికసంక్షేమ బాలికల కళాశాలలో పోలీసులతో కలసి ఆయన రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువే వ్యక్తికి గుర్తింపు ఇస్తుందన్నారు. అనంతరం వసతి గృహ ఆవరణలో కొబ్బరి మొక్కలను నాటారు. అనంతరం విద్యార్థులు డీఎస్పీతోపాటు పోలీసులకు రాఖీ కట్టారు. పట్టణ సీఐ నాగమల్లేశ్వరరావు, చిలకా జాన్‌సన్, కంచర్ల బుల్లిబాబు, హాస్టల్ సంక్షేమ అధికారి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు ప్రాణాంతకం

● సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ విజయ కుమార్

సత్తెనపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగం ప్రాణాంతకమని సత్తెనపల్లి ఎక్సైజ్ సీఐ విజయ కుమార్ అన్నారు. పట్టణంలోని మార్టిన్ పేటలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై శనివారం ప్రజలను చైతన్య వంతం చేస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మద్యం, డ్రగ్స్, సిగరెట్, పాన్‌పరాగ్ వంటివి వినియోగిస్తే అవి మానవుడిపై దీర్ఘకాలం ప్రభావం చూపిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగలక్ష్మి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ విజయ కుమార్, ఎస్ఐ నాగలక్ష్మి, కాలనీ వాసులు


ఆగిపోయిన లిఫ్ట్ పనులు


వారసత్వ కేంద్రం

- పర్యాటక కేంద్రం మూత పడి ఆరేళ్లు
- శిథిలమవుతున్న కట్టడాలు..
- దుమ్ముకొట్టుకుపోతున్న శిల్పాలు
- పర్యాటక శాఖ నిర్లక్ష్యానికి పరాకాష్ట

వారసత్వ కేంద్రంలో.. అలసత్వం ప్రదర్శన


ముసుగు వేసిన అమరావతి శిల్పాలు


నిరుప యోగంగా ఉన్న బయో టాయిలెట్లు

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వారసత్వం కేంద్రం... పాలకుల అలసత్వానికి నిదర్శనగా మారింది. చారిత్రక శిల్పాలు ముసుగులు ధరించి.. దుమ్ము కొట్టుకుపోతున్నాయి. పర్యాటకులతో కళకళలాడాల్సిన కేంద్రం.. పావురాళ్ల వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. వారసత్వ కేంద్రంగా.. కేంద్ర ప్రభుత్వం గుర్తించి విడుదల చేసిన నిధులు ఖర్చు అయినా.. ప్రజలకు ప్రయోజనం లేకుండాపోతోంది. గత వైసీపీ ప్రభుత్వంలో మూత పడిన కేంద్రం నేటికీ.. తెరుచుకోకపోవడం విస్మయానికి గురిచేసే అంశమైతే.. పర్యాటక శాఖ నిర్లక్ష్యానికి ఇది పరాకాష్టగా చేరింది. అమరావతిలోని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధీనంలో ఉన్న కాలచక్ర మ్యూజియంను గత టీడీపీ ప్రభుత్వంలో.. పర్యాటక సలహాదారు గల్లా అమరేశ్వర్ వారసత్వ కేంద్రంగా పేరు మార్చారు. సుమారు రూ.7.5 కోట్ల హెరిటేజ్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వైసీపీ అధికారంలోకి రావడంతో.. వారసత్వ కేంద్రం మూతపడింది. మ్యూజియంలో ఉన్న అమరావతి శిల్పాలపై గుడ్డలు కప్పి ఉంచారు. నిర్మాణంలో ఉన్న పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఆగిపోయిన పనులు పూర్తి చేస్తారని అనుకున్న స్థానికులకు నిరాశే ఎదురైంది. వారసత్వ కేంద్రంలో ప్రాచీన కళలకు ప్రోత్సాహం, ఆడిటోరియం, సెంట్రల్ ఏసీ, చిన్న పిల్లలకు వేసవిలో ప్లే స్కూల్ పేరుతో ప్రత్యేక హాలు కేటాయించారు. ఇండియన్ ఆయిల్ కంపెనీ ఇక్కడ బయో టాయిలెట్లు, సోలార్ ప్యానల్స్, వర్షపు నీటి నిల్వ సౌకర్యాల కల్పనకు.. రూ.50లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ పనులు కూడా అర్ధంతరంగా ఆగిపోయి ఆరు సంవత్సరాలు అవుతోంది. మూత పడిన ఈ కేంద్రంలో పావురాళ్ల వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతోంది. పర్యాటక శాఖకు చెందిన సామగ్రి కూడా ఇందులో భద్రపరచడంతో స్టోర్ రూంగా మారింది. వారసత్వ కేంద్రం బయట మాత్రం.. భారీ వాహనాలు, చిరు వ్యాపారుల దుకాణాలు దర్శనమిస్తాయి. ఇప్పటికైన పర్యాటక శాఖ అధికారులు స్పందించి వారసత్వ కేంద్రంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేసి పర్యా టకులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది. అలాగే. పెదకూరపాడు నియోజకవర్గంలోని పర్యాటక కట్ట డాల మనుగడకు, అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేసి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌ను ప్రజలు కోరుతున్నారు.

గిరిజనుల సంక్షేమానికి నిబద్ధతతో కృషి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని
- గుంటూరులో ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమానికి, అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో పెమ్మసాని, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, మహమ్మద్ నసీర్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహరాజ్, ఏకలవ్యుడు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వెన్నలకంటి రాఘవయ్య, చెంచులక్ష్మి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. దీక్షతో విలు విద్య నేర్చుకున్న ఏకలవ్యుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, పేదల కోసం అవిశ్రాంతమైన పోరాటం చేసిన వెన్నలకంటి రాఘవయ్యను గిరిజనులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో సీఎం కేంద్ర గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేశారని, గిరిజనులు సాగు చేస్తున్న అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేస్తున్నారన్నారు. పార్లమెంట్ ఆవరణలోనూ అరకు కాఫీ స్టాల్‌ను ఏర్పాటు చేయించారన్నారు. నగరపాలక సంస్థ కమిషనరు పులి శ్రీనివాసులు మాట్లాడుతూ


గుంటూరు నాజ్ సెంటర్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, గిరిజన సంఘాల నాయకులు

మున్సిపల్ దుకాణాల కేటాయింపులో గిరిజనులకు రిజర్వేషన్ అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ గిరిజనుల జనభా ప్రతిపాదికన రాజకీయంగా, అభివృద్ధికి, సంక్షేమానికి సీఎం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తుందన్నారు. బీసీ కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు దేశానికి వెన్నుముక అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు మాట్లాడుతూ విద్య ద్వారానే ప్రపంచాన్ని జయించవచ్చని, గిరిజనుల పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగాలన్నారు.ఈ సమావేశంలో గిరిజన సంఘాల నాయకులు చంద్రానాయక్, కట్టా వెంకటేశ్వర్లు, బాపట్ల ఏసుబాబు, బాపట్ల బ్రహ్మయ్య, కొమరిగిరి సూరిబాబు, సంజయ్ బాబు, కృష్ణా నాయక్, కోటయ్య, తలపాల నాగేశ్వరరావు మాట్లాడుతూ గిరిజనుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. జిల్లా యూనిట్‌గా తీసుకొని గిరిజనులకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, అటవీ భూములు సాగులు చేసుకునేవారికి పట్టాలు ఇవ్వాలని, గిరిజన వసతి గృహాల్లో మాన్యువల్‌గా అడ్మిషన్లు నిర్వహించాలని కోరారు. సంక్షేమ పథకాల అమలుకు ఆధార్ కార్డులు మంజూరు చేయించాలని కోరారు. జిల్లాలో గిరిజన భవన్ పెండింగ్ పనులు పూర్తి చేయాలని, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు. సభలో గిరిజన సంప్రదాయాన్ని తెలియచేసేలా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తొలుత స్థానిక కొత్తపేట నాజ్ సెంటరులో ఏకలవ్య, వెన్నలకంటి రాఘవయ్య, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు మంత్రి పెమ్మసాని, కమిషనరు శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, గిరిజన సంఘాల నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి మురళీధర్, డిప్యూటీ మేయర్ సజీల, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్యం యువత జీవన నైపుణ్యాలకు దిక్సూచి

- సుప్రీం కోర్టు విశ్రాంత సీజే జస్టిస్ ఎన్వీ రమణ

గుంటూరు(విద్య),ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మన తెలుగు సాహిత్యం, అద్భుత జీవన నైపుణ్య వాహిణి అని, ఆత్మన్యూనత, అభద్రత, అశాంతి, నైరాశ్యంలో ఉన్న యువతకు తెలుగు స్వాంతన చేకూర్చే అద్భుత సంజీవని అని సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ఉద్బోధించారు. చౌడవరంలోని ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జరిగిన పదవ స్నాతకోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వేమన శతకం, సుమతీ, కృష్ణ, దాశరధి శతం వంటివి చదితే ఎన్నో జీవన సత్యాలు, జీవన నైపుణ్యాలు తెలుస్తాయని విద్యార్థులకు సూచించార. శ్రీశ్రీ రచించిన మహా ప్రస్తానం వంటి గ్రంథాలు యువతకు స్ఫూర్తిని, మార్గనిర్దేశిస్తాయన్నారు. యువత తెలుగు సాహిత్యం గొప్పదనం తెలుసుకోవాలని సూచించారు. తమ హక్కుల కోసం అయిదేళ్ల పాటు పోరాటం చేసిన అమరావతి రైతుల విజయగాధ నేటితరం యువతకు స్ఫూర్తిగా నిలవాలన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఇదో మూస పద్ధతి..

పదవ తరగతి తర్వాత కార్పొరేట్ కళాశాలలో చేరడం అక్కడ జైలు లాంటి గదుల్లో విద్యనభ్యసించి ర్యాంకు సాధించడం.. తర్వాత ఇంజనీరింగ్ పూర్తిచేసి ఇతర దేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలతో డాలర్ల సంపాదించడం అనే మూస పద్ధతి కొనసాగుతోందని విశ్రాంత సీజే ఎన్వీ రమణ అభిప్రాయపడ్డారు. దీనివల్ల యువత



విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేస్తున్న జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు

జీవితంలో అభివృద్ధి ఆగిపోతోందన్నారు. ఫలితంగా.. సృజనాత్మకంగా ఆలోచించడం, సిద్ధాంతాలను విస్తరింప చేయడం, జ్ఞానాన్ని పెంచుకోవడం జరగడం లేదని ఆం దోళన వ్యక్తం చేశారు.

సమస్యల్ని అస్త్రాలుగా మార్చుకోవాలి: ఆచార్య మధుమూర్తి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె.మధు మూర్తి మాట్లాడుతూ విజన్ ఆంధ్ర - 2047 చదువే తమ ముందున్న లక్ష్యమని, ఇంజనీరింగ్ విద్యార్థులు తమ ముందున్న సమస్యలను అవకాశాలుగా మార్చుకొని వాటికి పరిష్కార మార్గాలను సాధించాలన్నారు. యువత వ్యక్తిత్వ నైపుణ్యాలను మెరుగు పరుచుకొని నూతన ఆవిష్కరణల వైపు ఆలోచనలను చేయాలని, సాంకేతిక రంగంలో భారతదేశం పురోగతి సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడ మిక్ అండ్ రీసెర్చి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పాలకమండలి సభ్యులు పి.గోపిచంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2021 - 25 సంవత్సర 37వ బ్యాచ్‌లో సివిల్, కెమికల్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టం, కంప్యూటర్ సైన్స్ (డేటా సైన్స్), కంప్యూటర్ సైన్స్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్), కంప్యూటర్ సైన్స్ (ఇంటర్నెట్ అఫ్ థింకింగ్), ఇన్ఫర్మే షన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రిక ల్ అం డ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రి పూర్తి చేసుకున్న 1023 మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ డిగ్రి పట్టాలను, 153 మందికి పీజీ పట్టాలను, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బంగారు పతకాలను అతిథులు ప్రదానం చేశారు.

మూడో లైన్ నిర్మాణం

పలు రైళ్ల రద్దు, దారి మళ్లింపు

- రెండు రోజులు నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి - దుగ్గిరాల, తెనాలి - చుండూరు మధ్యన మూడో రైలు మార్గం నిర్మాణ పనుల కారణంగా నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రెండు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు గుంటూరు డీఆర్ఎం సుదేష్ణ సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12733 తిరుపతి - లింగంపల్లి.. నెల 17, 18 తేదీలు, 12734 లింగంపల్లి - తిరుపతి 18, 19 తేదీల్లో రద్దు చేశామన్నారు. 22708 తిరుపతి - విశాఖపట్టణం ఏసీ డబుల్ డెక్కర్ ఈ నెల 13, 15, 17 తేదీల్లో.. 22707 విశాఖపట్టణం - తిరుపతి ఏసీ డబుల్ డెక్కర్‌ని ఈ నెల 14, 16, 18 తేదీల్లో రద్దు చేస్తున్నామన్నారు.

8 రోజుల పాటు డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లు గుంటూరు వరకే..

17625 కాచీగూడ - రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్ ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు, 17645 చర్లపల్లి - రేపల్లె ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు వరకే ప్రయాణిస్తాయని డీఆర్ఎం తెలిపారు. ఈ రెండు రైళ్లను గుంటూరు - రేపల్లె మధ్యన రద్దు చేసినటు పేర్కొన్నారు. వీటి జోడి రైళ్లు 17626 రేపల్లె - వికారబాద్, 17646 రేపల్లె - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌లు ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు గుంటూరు నుంచి బయలు దేరుతాయని తెలిపారు.

11 రోజులు.. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9 నుంచి 19వ తేదీ వరకు విజయవాడ నుంచి మంగళగిరి మీదగా గుంటూరు వచ్చి లింగంపల్లికి బయలుదేరుతుంది. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుంచి మంగళగిరి మీదగా విజయవాడ అక్కడి నుంచి రెగ్యులర్ రూట్‌లో ప్రయాణిస్తుంది.

వందేభారత్ కొంచెం ఆలస్యంగా...

20702 తిరుపతి - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 18 తేదీల్లో తెనాలి నుంచి నేరుగా విజయవాడ వెళ్లి అక్కడి నుంచి గుంటూరుకు వచ్చి సికింద్రాబాద్‌కు బయలుదేరుతుంది. దీని వల్ల కొంత ఆలస్యమవుతుంది. 20701 సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ కూడా గుంటూరు నుంచి విజయవాడ వెళ్లి అక్కడి నుంచి తిరుపతికి బయలుదేరుతుంది.

శబరి, చెన్నై ఎక్స్‌ప్రెస్‌లు కాజీపేట మార్గంలో...

17229 తిరువనంతపురం - సికింద్రాబాద్ శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 18 తేదీల్లో తెనాలి నుంచి విజయవాడ, కాజీపేట మీదగా సికింద్రాబాద్‌కు చేరుకొంటుంది. 17230 సికింద్రాబాద్ - తిరువనంతపురం శబరి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18న కాజీపేట, విజయవాడ, తెనాలి మీదగా ప్రయాణిస్తుంది. 12603 చెన్నై సెంట్రల్ - చర్లపల్లి చెన్నై ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17, 18, 19 తేదీల్లో, 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ చెన్నై ఎక్స్‌ప్రెస్ ఈ నెల 18, 19, 20 తేదీల్లో కాజీపేట మార్గంలో ప్రయాణిస్తాయి.

7 నుంచి రెగ్యులర్ మార్గంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునర్ నిర్మాణంలో భాగంగా ప్రస్తుతం చర్లపల్లి నుంచి లింగంపల్లికి నేరుగా ప్రయాణిస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 7 నుంచి రెగ్యులర్ రూట్‌లో ప్రయాణించనుంది. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ పైన పేర్కొన్న తేదీ నుంచి చర్లపల్లికి సాయంత్రం 6.05కి, సికింద్రాబాద్‌కు 6.20కి, బేగంటపేటకు 6.35, లింగంపల్లికి రాత్రి 7.40కి చేరుతుంది. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ వచ్చే నెల 7 నుంచి లింగంపల్లిలో ఉదయం 6.15కి బయలుదేరి బేగంటపేకు 6.35కి, సికింద్రాబాద్‌కు 6.55, చర్లపల్లికి 7.15కి చేరుకొని గుంటూరు మీదగా విశాఖపట్టణం బయలుదేరి వెళుతుంది.

విద్యార్థి ప్రతిభా వాణి!

- 72 పేజీల బుక్‌లెట్‌లోనే అన్ని పరీక్షల సమాధానాలు
- విద్యార్థి విద్యా ప్రమాణాలు తెలియజేస్తుంది
- ఎఫ్‌ఏ-1 నుంచి అమలుకు విద్యాశాఖ సిద్ధం



బుక్‌లెట్

సత్తెనపల్లి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఈ 72 పేజీల బుక్‌లెట్ విద్యార్థుల ప్రతిభకు కొలమానం కానుంది. ఒక విద్యార్థి ఏ సబ్జెక్టులో మెరుగ్గా ఉన్నాడు.. ఏ పాఠ్యాంశంలో వెనుకబడి ఉన్నాడో... ఈ సమాధాన పుస్తకమే తెలియజేస్తుంది. సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు.. సంవత్సర పరీక్షలకు ముందు.. నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్ విధానాల్లో పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులకు పరీక్ష పత్రాలు ఇచ్చి.. జవాబులను టావులు, లేదా ఇతర తెల్ల కాగితాల్లో రాయిస్తారు. ఈ జవాబు పత్రాలు విద్యార్థులు మార్కులు చూసుకున్నంత వరకే ఉంటాయి. ఆ తర్వాత ఒక మూలకు చేరుతాయి. విద్యా సంవత్సరం ముగింపులో.. అన్ని పరీక్షల జవాబు పత్రాలను ఒక చోటకి చేర్చి చూసినప్పుడు.. పరీక్షకు పరీక్షకు మధ్య.. విద్యార్థి ప్రమాణాలు ఏ మేరకు మెరుగుపడ్డాయో తెలుస్తుంది. ఇప్పుడు ఇదే పనిని పాఠశాల విద్యాశాఖ చేస్తోంది.

ఎఫ్ ఏ 1 నుంచి ప్రారంభం..

ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఎఫ్-ఏ 1 నిర్వహించనున్నారు. విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నపత్రంలోని ప్రశ్నలకు జవాబులు రాయడానికి 72 పేజీలతో కూడిన ఈ బుక్‌లెట్ ఇవ్వనున్నారు. ఒక తరగతిలో ఎన్ని పాఠ్యాంశాలు ఉంటాయో అన్నింటికీ ఒక్కో బుక్‌లెట్ ఇస్తారు. ప్రశ్న పత్రాల్లోని జవాబులు ఈ బుక్‌లెట్‌లో రాయాలి. ఇలా అన్ని పరీక్షల జవాబులను ఈ బుక్‌లెట్‌లోనే రాయాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థుల పఠన పురోగతి, ప్రమాణాలను ఒకే చోట అందుబాటులో ఉంటాయని విద్యాశాఖ అధికారులు చెపుతున్నారు. పరీక్షకు..పరీక్షకు మధ్య విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో తెలుస్తుంది. విద్యార్థుల రాసిన జవాబులను దిద్దేటప్పుడు ఉపాధ్యాయులు రిమార్కులను అక్కడే సూచించాల్సి ఉంటుంది. ఉదాహరణకు విద్యార్థి ఒక ప్రశ్నకు సరైన సమాధానం ఇవ్వకుండా.. మరో జవాబు రాస్తే అది కచ్చితంగా తప్పు అవుతుంది. దానికి ఉపాధ్యాయులు సున్నా మార్కులు వేస్తారు. అలా ఎందుకు ఇచ్చారో.. ఉపాధ్యాయులు జవాబు పక్కనే రిమార్క్స్ చెప్పాల్సి ఉంటుంది. ఈ విధానం విద్యార్థి విద్యా ప్రమాణాలు తెలియజేస్తుందని స్థానిక ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

నేలమట్టం!



భారీ యంత్రంతో కొనసాగుతున్న ఆర్‌వోబీ కూల్చివేత

గుంటూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శంకర్‌విలాస్ ఆర్‌వోబీ (రోడ్డు ఓవర్ బ్రిడ్జి) కూల్చివేత పనులు పూర్తిస్థాయిలో ప్రారంభమయ్యాయి. శుక్రవారం అర్ధరాత్రి ఈ పనులకు అంకురార్పణ జరగగా శనివారం ఉదయం నుంచి భారీ యంత్రంతో కూల్చివేత కొనసాగుతోంది. అరండల్‌పేట, బ్రాడీపేట వైపున బ్రిడ్జి కూల్చివేతని కాంట్రాక్టు ఏజెన్సీ మొదలు పెట్టింది. రెండో శనివారం సెలవుదినం కావడంతో ట్రాఫిక్ సమస్య ప్రభావం నగరంలో అంతగా కనిపించ లేదు. సోమవారం విద్యా సంస్థల బస్సులన్నీ రోడ్ల పైకి వచ్చిన తర్వాతే బ్రిడ్జి కూల్చివేత వల్ల ఏ ప్రాంతంలో సమస్యలు తలెత్తుతాయో స్పష్టమవుతుంది. ట్రాఫిక్ మళ్లిం పునకు.. ఇక్కడ ప్రత్యామ్నాయం లేదు. ఇందుకు కారణం ఈ బ్రిడ్జి కిందనే గుంటూరు రైల్వే యార్డు ఉంది. ఏ చిన్న సమస్య తలెత్తినా రైళ్లన్నీ నిలిచిపోతాయి. కొంచెం దూరమైనప్పటికీ మూడొంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ/ఆర్‌వోబీ, ఇన్నర్‌రింగు రోడ్డు మీదగా రాకపోకల ను మళ్లిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయడానికి రెండేళ్ల కాల వ్యవధిని నిర్దేశించుకొన్నారు. ఆలోపు పూర్తి చేయాలంటే పనులు వేగవంతంగా జరగాలి. రోజురోజుకు పురోగతి ఉండాలి. ఇప్పటికే ఇరువైపులా రెండు పిల్లర్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. మరో 19 పిల్లర్లను నిర్మించాలి. రీఇన్‌ఫోర్స్‌డ్ వాల్ వరకు తొలుత బ్రిడ్జిని తొలగిస్తున్నారు. ఆ తర్వాత పాత బ్రిడ్జి పిల్లర్లను ఒక్కొక్కటిగా తొలగించేందుకు నిర్ణయించారు. మరోవైపు బ్రాడీపేట ఒకటో లైను నుంచి లాడ్జి సెంటర్ వరకు రోడ్డుని 120 అడుగులకు విస్తరిస్తున్నారు. దీనిపై కొందరు కోర్టులో కేసులు వేశారు. అయినప్పటికీ కార్పొరేషన్ ముందుగా కన్‌సెంట్ ఇచ్చిన వారి భవనాలను తొలగిస్తోంది. ప్రజాప్రయోజనాల రీత్యా ఈ నిర్ణయం తీసుకొన్నందున అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేస్తోంది. కాగా ఈ బ్రిడ్జి డిజైన్‌ని వ్యతిరేకిస్తున్న వారు కోర్టులో న్యాయపోరాటం కొనసాగిస్తున్నారు.



నేడు నాదెండ్లలో వైద్యశిబిరం

నాదెండ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : నాదెండ్ల గ్రామంలోని గంగా పార్వతి సమేత మూల స్థానేశ్వర స్వామి కల్యాణ మండపంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు డాక్టర్ నల్లమోతు ప్రవీణ్ తెలిపారు. తనతో పాటు న్యూరాలజిస్టు మెడబలిమి సౌమ్య పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించటంతో పాటు మందులు పంపిణీ చేస్తారన్నారు.

రాఖీ పౌర్ణమి వేడుకలు

రొంపిచర్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని గ్రామాల్లో రాఖీ పౌర్ణమిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. అన్నా చెల్లెలు, అక్కా తమ్ముడు అనుబంధానికి ప్రతీకగా ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు. సోదరులకు రాఖీలను కట్టి మిఠాయిలు తిని పించారు. గ్రామాల్లో రాఖీ దుకాణాల వద్ద సందడి నెలకుంది. చిన్నా పెద్ద తేడా లేకుండా రాఖీలను కొనుగోలు చేశారు.

మహిళలకు చీరల కానుక

చిలకలూరిపేట, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 10, 25, 26, 31, 32 వ వార్డులలో రాఖీ పౌర్ణమి పండుగను జన సైనికులు శనివారం నిర్వహించారు. వంద మందికి పైగా అక్క చెల్లెళ్లకు చీరలను కానుకగా ఇచ్చి వారితో కలిసి రాఖీ పండుగ నిర్వహించు కున్నారు. జనసేన సీనియర్ నాయకులు తోట రాజారమేష్, మండలనేని చరణ్‌తేజ, షేక్ మునీర్‌హసన్, పఠాన్ ఖాదర్ బాషా, కూరపాటి శివశంకర్, వెంకట స్వామి, జానీ పాషా, అచ్చుకోల వెంకటప్ప య్య, మండలనేని నాగరాజు పాల్గొన్నారు.

వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

నరసరావుపేట అర్బన్, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): నరసరావుపేట పట్టణంలోని ము న్సిపల్ కార్యా లయ ప్రాంగణం లో ఉన్న శ్రీ కల్యాణ వేంకటే శ్వర స్వామి దేవ స్థానంలో శ్రవణా నక్షత్రం సంద ర్భంగా శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రావణ మాసం, పౌర్ణమి కలసి రావటంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. స్వామి వారికి అభిషేకాలను అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ నిర్వహించారు. అనంత రం స్వామికి విశేష అలంకరణ చేశారు. స్వామి వారిని భక్తులు దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నందమూరి క్రిష్టర్‌కు ప్రముఖుల అభినందనలు

చిలకలూరిపేట, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏసుక్రీస్తు దివ్య శాంతి నిల యం పాస్టర్ నందమూరి క్రిష్టర్ 17 రాష్ట్రాల ప్రతినిధులతో ఏర్పడిన ఆల్ ఇండియా బిషప్స్ అండ్ పాస్టర్స్ ఫెలోషిప్ సంఘం జాతీయ కమిటీకి నేషనల్ జాయింట్ సెక్ర టరీగా ఎన్నికైన సందర్భంగా శనివారం పలు వురు పట్టణ ప్రముఖులు ఆయనను అభినం దించి సత్కరించారు. రెండు సంవత్సరాలుగా పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడి గా ఉంటూ నందమూరి క్రిష్టర్ జిల్లా వ్యా ప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిం చారని వారు కొనియాడారు. నందమూరి క్రిష్టర్‌ను కలిసి సత్కరించిన వారిలో మాదా సు భానుప్రసాద్, అందెల శౌరి, తోట శ్రీని వాసరావు, అచ్చుకోలు మురళీకృష్ణ, మల్లెల శివనాగేశ్వరరావు, తన్నీరు వీరయ్య ఉన్నారు.

సాగర్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): నాగార్జున ప్రాజెక్ట్ నీటిమట్టం శనివారం నాటికి 589.70 అడుగులు ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6041 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7436, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,313, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 44,890 క్యూసెక్కుల నీటిని దిగువకు విడు దల చేస్తున్నారు. శ్రీశైలంనుంచి ఇన్‌ఫ్లోగా 65,530 క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతోంది.

పులిచింతల...

అచ్చంపేట, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.76 టీఎంసీల నీటినిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 37,705 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరు తుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, రెండు గేట్ల ద్వారా 34,409, లీకుల ద్వారా 400, మొత్తం 51,409 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపల్లి మెడికల్ కళాశాల సమీపంలో గుర్తుతెలియని ఓ యువకుడు చెట్టుకు ఉరి పోసుకొని మృతిచెందినట్లు స్థానికులు పోలీ సులకు సమాచారం అందించారు. ఎస్ఐ మోహన్ సంఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. ఎటువంటి ఆధారాలు లభించలేదని ఎస్ఐ తెలిపారు.

మహిళ మృతదేహానికి పోస్టుమార్టం

రాజుపాలెం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌటపాపాయపాలెం సమీ పంలో మృతి చెందిన గుర్తు తెలియని మహిళ మృతదేహానికి శనివారం పోస్టు మార్టం నిర్వహించారు. గుంటూరు మెడికల్ కాలేజి ఫోరెన్సిక్ ప్రొఫెసర్, పల్నాడు జిల్లా క్లూస్ టీం వచ్చి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సీఐ కిరణ్, ఎస్ఐ వేణుగో పాల్ పర్యవేక్షించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

సత్తెనపల్లి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : పట్ట ణంలోని పార్కు ఏరియాలో ఐదు రోజుల క్రితం డి.లక్ష్మీకాంతమ్మ అనే వృద్ధురాలిపై దాడి చేసి బంగారాన్ని అపహరించిన కేసు లో ఇద్దరు యువకులను శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

ఘనంగా కోటప్పకొండలో గిరి ప్రదక్షిణ



శ్రావణ పౌర్ణమి సందర్భంగా మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో శనివారం ఘనంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కోడెల శివరామకృష్ణ వందలాది మంది భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు (నరసరావుపేట రూరల్)

జాతీయ స్థాయి ఈత పోటీలకు షేక్ మొహిద్దీన్ ఎంపిక


మొహిద్దీన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఈత(వాటర్ పోలో) పోటీలకు నరసరావు పేట ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబుకు ఈత లో శిక్షణ ఇచ్చే షేక్ ఖాజా మొహిద్దీన్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా షేక్ ఖాజా మొహిద్దీన్ శనివారం ఎమ్మె ల్యే డాక్టర్ చదలవాడ అర విందబాబును మర్యాద పూర్వకంగా కలిశా రు. గుజరాత్ స్టేట్ ఆక్వటిక్ అసోసియేషన్ స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వ ర్యంలో అహ్మదాబాద్‌లో నరన్‌పురా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 13 నుంచి 17 వరకు 78వ సీనియర్ నేషనల్ అక్వటిక్ ఛాంపియన్ షిప్-2025 పోటీలు నిర్వహిస్తు న్నారు. ఈ పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ తరఫున ఈత శిక్షకుడు, చందోల్‌కు చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్ పాల్గొంటున్నారు. పోటీల్లో పాల్గొనడానికి అహ్మ దాబాద్ బయలు దేరిన షేక్ ఖాజా మొహిద్దీన్‌ను ఎమ్మెల్యే చదలవాడ అభినందించారు. గతంలో అనేక జాతీ య, అంతర్జాతయ పోటీల్లో పాల్గొన్న అనుభవం మొహిద్దీన్‌కు ఉందని అరవింద బాబు అన్నారు.

489 మందికి ఉచితంగా కంటి వైద్య పరీక్షలు


కళ్ళజోళ్ళు పంపిణీ చేస్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : నరసరావుపేట పట్టణం రాజాగారి కోటలో డాక్టర్ కోడెల శివప్రసాదరావు చారిట బుల్ ట్రస్ట్, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ కోడెల శివప్రసాదరావు ఆస్పత్రిలో జరిగిన కంటి వైద్యశిబిరాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోడెల శివరామకృష్ణ ప్రారంభించారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రుతుజా, డాక్టర్ ప్రియాంకలు వైద్య పరీక్షలు నిర్వహించారు. 489 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, వారిలో 236 మందికి శస్త్రత చికిత్సకు సిపార్సు చేశారు. ఈ సంద ర్భంగా గతంలో ఆపరేషన్ చేయించుకున్న వారికి డాక్టర్ కోడెల శివరామకృష్ణ కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొల్లి ఆంజ నేయులు, మందాడి రవి, కొక్కిరాల శ్రీనివాస రావు, మాజీ కౌన్సిలర్ కదం నాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రాఖీలు కట్టిన విద్యార్థినులు

రాఖీ పౌర్ణమి సందర్భంగా డాక్టర్ కోడెల శివ రామకృష్ణకు డాక్టర్ కోడెల శివప్రసాద రావు ఆస్పత్రిలో శనివారం పలువురు మహి ళలు రాఖీలు కట్టారు. ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినులు ఆయనకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా విద్యార్థిను లకు శివరామకృష్ణ రాఖీ పౌర్ణమి శుభాకాం క్షలు తెలియజేశారు. మాజీ కౌన్సిలర్ కదం నాగ జ్యోతి పలువురు టీడీపీ చెందిన మహి ళలు కూడా రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎండీ షేక్ మస్తాన్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సంస్కృతికి ఆది పురుషుడు విఖనస మహర్షి

● నారాయణ తనూజ్ విష్ణువర్ధన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న నారాయణ తనూజ్ విష్ణువర్ధన్ తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి) : మహావిష్ణువు అర్చన ఆరాధన విధా నాన్ని శ్రీవైఖానస కల్ప సూత్రం ద్వారా లోకా నికి ప్రబోధించిన ప్రథముడు విఖనస మహ ర్షి అని రాష్ట్ర అర్చక శిక్షణ అకాడమీ మాజీ డైరెక్టర్, తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వ విద్యాలయం అధ్యాపకుడు నారాయణ తనూ జ్ విష్ణువర్ధన్ అన్నారు. వైఖానస పరిషత్ ఆధ్వర్యంలో శనివారం శ్రావణ పూర్ణిమ సం దర్భంగా నరసరావుపేట బరంపేటలోని శ్రీ లీలా వెంకటేశ్వరస్వామి ఆలయంలో విఖన స మహర్షి జయంతి ఉత్సవాలు నిర్వహించా రు. కార్యక్రమానికి వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తనూజ్ విష్ణువర్ధన్ మాట్లాడు తూ ఆలయ సంస్కృతికి ఆది పురుషుడైన విఖనస మహర్షి ఆలయాల నిర్మాణం, వా స్తు, ప్రతిష్ఠ, అర్చన స్నపన, ఉత్సవ, ప్రాయ శ్చిత్త తదితర విశేషాలు ఆగమ శాస్త్రంలో వివరించారన్నారు. శ్రావణ పూర్ణిమ శ్రవణా నక్షత్రం, సోమవారం సింహ లగ్నంలో నైమి శారణ్య పుణ్యక్షేత్రంలో అవతరించిన విష్ణు మానస పుత్రుడు విఖనస మహర్షికి చెందిన వంశీయులు వైఖానసలుగా మహావిష్ణువుకు ఆలయాల్లో ఆగమశాస్త్రపరంగా అర్చనలు నిర్వహిస్తున్నారని చెప్పారు. తనూజ్ విష్ణు వర్ధన్‌ను వైఖనస పరిషత్ ఆధ్వర్యంలో ఆల య కమిటీ చైర్మన్ కేపీ రంగారావు, పరిషత్ గౌరవాధ్యక్షుడు రొంపిచర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు నారాయణ సత్యనారాయణ ప్ర సాద్, కార్యదర్శి రత్నాకరం శ్రీనివాస ఆంజ నేయ ప్రసాద్, కోశాధికారి రొంపిచర్ల లక్ష్మీ నారాయణ, ఘనంగా సన్మానించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి యన్నం వెంకటనర్సిరెడ్డి

● డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి


అభినందన సంచిక ఆవిష్కరిస్తున్న కాసు ప్రసాద్‌రెడ్డి తదితరులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ, సాహిత్య, గ్రంథాలయ రంగాల్లో విశిష్టసేవలు అందించిన బహు ముఖ ప్రజ్ఞాశాలి యన్నం వెంక ట నర్సిరెడ్డి అని డాక్టర్ కాసు ప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం నరసరావు పేట మండలం ఉప్పలపాడులోని ప్రసన్న సాయిరామే కల్యాణ మండపంలో యన్నం వెంకట నర్సిరెడ్డి సహస్రచంద్ర దర్శన మహో త్సవం సందర్భంగా యన్నం వెంకట నర్సిరెడ్డి అభినందన సంచిక ఆవిష్క రించారు. ఈ సందర్భంగా కాసు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉప్పలపాడు అభివృద్ధికి ఎంతో కృషి చేశార న్నారు. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ వెంకట నర్సిరెడ్డి అరుదైన నా యకుడని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, కాసు వెంకట రాజగోపాలరెడ్డి, కాసు అభిరామ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ రావు, డాక్టర్ అక్కిరాజు సుందర రామ కృష్ణ, పొన్న పాటి ఈశ్వరరెడ్డి, డాక్టర్ చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, గంధం యజ్ఞవల్క్యశర్మ, టీ నరసింహారావు, సీనియర్ జర్నలిస్ట్ అమరయ్య, యన్నం వీరాంజనేయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ


పూజల్లో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి హరీష్ బాబు, కుటుంబ సభ్యులు

నకరికల్లు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దే వాలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం శనివారం నకరికల్లులో వైభవంగా జరి గింది. జీవధ్వజ గోపుర శిఖరకలశ శిలావిగ్రహాలను ప్రతిష్ఠించారు. మహా గణపతి, బ్రహ్మేశ్వరస్వామి, ఈశ్వరి మహాదేవి, సిద్ధమూర్తి, నందీశ్వరస్వామి, నా గేంద్రస్వామి, అభయాంజనేయస్వామి దేవతా మూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భక్తుల కు భారీగా అన్నదానం చేశారు. పూజా కార్యక్ర మాల్లో తెలంగాణా రాష్ట్రం దేవరకొండ జూని యర్ సివిల్ జడ్జి కేవీ హరీష్‌బాబు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యు లు ఆలయ మర్యాదలతో హరీష్‌బాబుకు స్వాగతం పలికారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

● 139 గ్రాముల బంగారం రికవరీ


చోరీ కేసులో అరెస్టు చూపుతున్న వినుకొండ సీఐ శోభన్‌బాబు

వినుకొండటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మండలం కొత్త పాలెంలో జూలై 31వ తేదీన రాయని మస్తానయ్య ఇంట్లో బీరువాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ముగ్గురిని విను కొండ మార్కెట్ యార్డు వద్ద అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శోభన్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా, తెనాలి, చెంచుపేటకు చెందిన పెండ్రాల పెద్ద సముద్రాలు, చిన్న సముద్రాలు, శ్రీను ముగ్గురి నుంచి చోరీకి గురైన 139 గ్రాముల బంగారాన్ని రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. దొంగలను పట్టు కునేందుకు కృషి చేసిన ఎస్ఐలు షామీర్ బాషా, కత్తి స్వర్ణలత, సిబ్బంది తిరుమలరావు, బాల వెంకటేశ్వర్లు, తిరుమలనాయక్, అజ్గర్, కె.శ్రీనివాసరావులను అభినందించారు.

డాక్టర్ నల్లమోతు ప్రసాదరావు మృతికి ఎమ్మెల్సీ మర్రి సంతాపం

చిలకలూరిపేట, ఆగస్టు9 (ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా పట్టణంలోని సుబ్బయ్యతోటలో రాయుడు కంటి హాస్పిటల్ ద్వారా నేత్ర వైద్యుడిగా సేవలందించిన నల్లమోతు ప్రసాదరావు మృతికి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ శనివారం సంతాపం తెలిపారు. ప్రసాద రావు భౌతికకాయాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలి పారు. పలువురు పట్టణ ప్రముఖులు ప్రసాదరావు భౌతికకాయా న్ని సందర్శించి నివాళులర్పించారు.

అడవిలో శవం అంటూ పుకార్లు..

● గాలింపు చేపట్టిన పోలీసులు, గ్రామస్థులు

ఈపూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అడవిలో శవం ఉందంటూ పుకార్లు రావడంతో పోలీసులు, గ్రామస్థులు అడవంతా గాలింపు చేపట్టారు. మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామానికి ఆనుకొని ఉన్న నల్లమల అడవిలో గుర్తుతెలియని మహిళ శవం ఉందని శుక్రవారం సాయంత్రం పుకార్లు వచ్చాయి. ఆ విషయం పోలీసు లకు తెలియడంతో వాళ్ళు శనివారం అడవిలో గాలింపు చేపట్టారు. పోలీసులతో పాటు గ్రామస్థులు అడవిలో వెతికారు. దాదాపు 6 గంటలు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో అడవిలో గాలించారు. ఎక్కడా ఎలాంటి ఆచూకి లభ్యం కాలేదు.

ప్రసన్నాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపిస్తున్న పూజారులు

శావల్యాపురం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురంలోని గుంటూరు - కర్నూలు జాతీయ రహదారి ప్రక్కనున్న ప్రసన్నాంజ నేయ స్వామి దేవాలయంలో 17వ వార్షిక వేడుకలను ఆలయ ధర్మకర్త కర్రి పెద అంజయ్య ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు వేకువజామునే దేవాలయానికి చేరుకొని స్వామికి పాలాభిషేకాలు నిర్వహించి నూతనవస్త్రాలు, పూలమాల లతో స్వామిని అలంకరించారు. పూజారి రావిపాటి సాయిభరత్ ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్ళు చేసి నైవేద్యం సమర్పిం చారు. అనంతరం పుణ్యదంపతులతో సువర్చలాదేవి, ప్రసన్నాంజ నేయస్వామి ఉత్సవ విగ్రహాలకు మేళతాళాలతో వైభవంగా కల్యా ణం జరిపించారు. కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాదాలు అందజే శారు. సాయంత్రం ఆలయంలో భక్తులు భజనలు చేశారు.

ఘనంగా మహేష్‌బాబు జన్మదిన వేడుకలు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులో ఉన్న అమ్మ-నాన్నల ప్రేమాలయం వృద్ధు ల ఆశ్రమంలో టౌన్ వైడ్ కృష్ణ-మహేష్‌బాబు యువశక్తి పట్టణ అధ్యక్షుడు ఎండీ ఫారూఖ్‌బాబు ఆధ్వర్యంలో సినీ నటుడు మహేష్‌బాబు జన్మదిన వేడుకలను ఘనంగా శనివారం నిర్వహిం చారు. కేక్ కట్ చేసి వృద్ధులకు, పిల్లలకు పంపిణీ చేశారు. అనం తరం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో అభిమానులు పీ వెంక టరావు, బీ కొండలరావు, లింగంగుట్ల రాములు, కందుకూరి దిలీప్, చిన్నికృష్ణ, ఎన్ గోపికృష్ణ, ఎస్ జయకృష్ణ, సీ ఆంజనేయులు, షేక్ సుభాని, షేక్ మీరావలి, కుక్కల పాల్, సాగర్, షేక్ సలామ్, ఎస్ థామస్, మన్నేపల్లి శ్రీను, నాగూర్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

చిలకలూరిపేట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మహేష్‌బాబు జన్మ దినం సందర్భంగా పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో అభిమా నులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కృష్ణ మహేష్ యువత, ఇ శ్రీనివాసరెడ్డి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వృద్ధులకు, యాచ కులకు భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అభి మాన సంఘాల నాయకులు మాట్లాడుతూ ఘట్టమనేని కుటుం బం ప్రజాసేవలో ముందుంటూ కృష్ణ వారసత్వాన్ని మహేష్‌బాబు ముందుకు తీసుకెళ్తున్నారని చెప్పారు. మహేష్‌బాబు తన సంపా దనలో కొంత భాగాన్ని కేటాయించి పేద పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు చేయించారని, మహేష్ బాబు కృష్ణ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులను చదివిస్తున్నారని అన్నారు. కార్యక్రమం లో గర్రె బాబూ రావు, మాదాసు వెంకటకోటయ్య, హనుమంత రావు, సుభాని, మహమ్మద్ గౌస్, మౌలాలి, హుస్సేన్ పాల్గొన్నారు.

జడ్పీటీసీ ఉపఎన్నికల ప్రచారంలో ప్రత్తిపాటి


ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు రాఖీ కడుతున్న మహిళ

చిలకలూరిపేట, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): పులివెందు ల, ఒంటిమిట్ట జడ్పీ టీసీ ఉపఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సా ధిస్తారని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. రెండు రోజులుగా ఆయన అక్కడ జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, శాప్ చైర్మన్ రవినా యుడుతో కలిసి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. శనివారం ఒంటిమిట్టలో ఒక మహిళ పుల్లారావుకు రాఖీ కట్టింది. మహిళల మద్దతు కూటమి అభ్యర్థులకేనని ఆమె ప్రత్తిపాటితో చెప్పారు.

కొనసాగుతున్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అలివేలు మంగా పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి

వినుకొండటౌన్, ఆగస్టు 9 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్ లో ఉన్న అలివేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి 39వ వార్షిక బ్రహ్మోత్సవాలు 4వ రోజు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఎస్ శ్రవ ణ్‌కుమార్, సీహెచ్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో స్వామికి విశ్వక్సేనపూజ, పుణ్యాహం, పంచామృత స్నాపన, ఆరాధన, అగ్నిధ్యానం, నిత్యహోమం, కుంభ పూజ నీరాజనం, మంత్రపు ష్పం వంటి పూజలు భక్తులను విశే షంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామి రథోత్సవ కార్యక్రమం పట్టణ పురవీధుల్లో కన్నుల పండువగా నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రెడ్డి బంగారయ్య, ప్రధాన కార్యదర్శి అచ్యుత కృష్ణ, సుబ్బారావు, కోశాధికారి కాళ్ల రామకోటేశ్వరరావు, సేవ కులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

గంజాయి, డ్రగ్స్ వినియోగంపై అవగాహన సదస్సు


మసీదు మాన్యంలోని ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ వినీల

వినుకొండటౌన్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు వినుకొండ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మసీదు మాన్యంలోని ప్రజలకు గంజాయి, డ్రగ్స్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ వినీల మాట్లాడుతూ నాటుసారా, గంజాయి, డ్రగ్స్ అల వాటుపడిన వారు మానసిక ఒత్తిడికి లోనవుతారన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల ఆర్యోగపరం, ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. కావున ఎవరూ కూడా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడరాదని, ఎవరైనా నాటుసారా, గంజాయి, డ్రగ్స్ అమ్ముతున్నట్లు సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచి బహుమతులు అందజేస్తామని ఆమె తెలిపారు.

మాదక ద్రవ్యాల వాడకం ఆరోగ్యానికి హానికరం



కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు

నాదెండ్ల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వాడకం ఆరోగ్యానికి హానికరమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని గణపవరంలో గత ధనలక్ష్మి కాటన్ మిల్లులో డ్రగ్స్, గంజాయి వినియోగ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సం దర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి లాంటి మాదక ద్రవ్యా ల వినియోగంతో భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు వాటి విని యోగంపై అవగాహన కల్గి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. కార్య క్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం గురవేశ్వరి, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

ఇర్లపాడు వైసీపీ అధ్యక్షుడిగా వీరాంజనేయులు

ఇర్లపాడు(శావల్యాపురం), ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు వైసీపీ మండల కన్వీనర్ బోడెపూడి వెంకటే శ్వర్లు(కొండలు) ఆధ్వర్యంలో మండలంలోని ఇర్లపాడులో వైసీపీ నూతన గ్రామ కమిటీ ఎన్నికను శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఇర్లపాడు గ్రామ అధ్యక్షు డిగా వెలగపూడి వీరాంజయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీ నర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి భీమని అంకారావు, సీనియర్ నాయకులు తిరువీధి రమణా రావు, బొల్లా సుబ్బారావు, బోడెపూడి శ్రీనివాసరావు, తన్నీరు అంకారావు, అబ్బూరి అయ్యన్న, షేక్ సైదా, వెంకటరెడ్డి, గ్రామనాయకులు పాల్గొన్నారు.

షూటింగ్ ట్రయల్స్‌కు ఎన్‌ఈసీ విద్యార్థుల ఎంపిక



షూటింగ్స్ ఎంపికైన విద్యార్థులతో కళాశాల నిర్వహకులు

నరసరావుపేట రూరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావు పేట ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ విద్యార్థులు ఆగస్టు 10 నుంచి 29 వరకు కాకినాడలో జరగనున్న ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్స్ సెలక్షన్ కు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శనివారం తెలిపారు. ఈ సంద ర్భంగా విద్యార్థులను కళాశాల నిర్వహకులు, అధ్యాపకులు అభినందించారు.

సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శిగా మారుతీ వరప్రసాద్

● సహాయ కార్యదర్శులుగా హుస్సేన్, కాసా రాంబాబు

వినుకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభల అనంతరం నరసరావుపేట రోడ్డులోని గంగినేని కల్యాణ మండపంలో జరిగిన సమావేశం లో పల్నాడు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీపీఐ పల్నా డు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సహాయ కార్యదర్శులుగా షేక్ హుస్సేన్, కాసా రాంబాబులతో పాటు 58 మంది కౌన్సిల్ సభ్యులుగా, 17 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.